రంజాన్ వేళలు
ఇఫ్తార్ (మంగళ) సా. 6.26
సహర్ (బుధ) ఉ. 4.38

ఎండా కాలమ్

	గరిష్ఠం	కనిష్ఠం
రాజమండ్రి	40.0	25.0



చంద్రబాబు, పవన్‌ల ఉమ్మడి సభకు స్థలాన్ని పరిశీలిస్తున్న శేషారావు

రేపు నిడదవోలులో చంద్రబాబు, పవన్ రోడ్ షో

నిడదవోలు, ఏప్రిల్ 8 : జిల్లాలో తొలిసారిగా నిడదవోలు పట్టణంలో బుధవారం టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు, జనసేన అధినేత పవన్‌కల్యాణ్ ఉమ్మడిగా రోడ్‌షో,బహిరంగ సభ నిర్వహించనున్నారు. ఈ మేరకు సోమవారం టీడీపీ నిడదవోలు ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు, టీడీపీ శ్రేణులు నిడదవోలు బ్రాహ్మణగూడెం రోడ్డులో ప్రాంతాన్ని సభావేదికకు, హెలిపాడ్‌ను పరిశీలించారు. సార్వత్రిక ఎన్నికల ప్రచారానికి రోడ్‌షోకు ఇద్దరు అధినాయకులు చంద్రబాబు, పవన్ రానున్న నేపథ్యంలో నిడదవోలు టీడీపీ,జనసేన పార్టీలో జోష్ పెరిగింది. ఉమ్మడి రోడ్‌షో, బహిరంగ సభను విజయవంతం చేయాలని బూరుగుపల్లి శేషారావు, ఉమ్మడి అభ్యర్థి కందుల దుర్గేష్ పిలుపునిచ్చారు.

వీఆర్‌కు నిడదవోలు సీఐ

- వైసీపీ నాయకుల ఆదేశంతో బెదిరింపు
- ఎన్నికల కమిషన్‌ను ఆశ్రయించిన జనసేన కార్యకర్త
- విచారించి వీఆర్‌కు పంపుతూ ఆదివారం ఆదేశాలు



నిడదవోలు, ఏప్రిల్ 8 : సార్వత్రిక ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘించడంతో ఒక సీఐ ఎన్నికల కమిషన్ ఆదేశాలతో వీఆర్‌లోకి వెళ్లారు. నిడదవోలులో ఇటీవల ఓ వైసీపీ మహిళానేతకు సమీప బంధువైన ఓ యువకుడు తన మిత్రులతో కలిసి జనసేన పార్టీలో చేరారు. దీంతో వైసీపీ మహిళా నేత జనసేన పార్టీ కార్యకర్తలపై కక్ష కట్టి తనకు ఉన్న పరిచయంతో సీఐ కె.వెంకటేశ్వరరావు ద్వారా జనసేన పార్టీకి చెందిన కార్యకర్త జి. రాజేష్‌ను పోలీస్ సర్కిల్ కార్యాలయానికి పిలిచి రెండు గంటల పాటు ఉంచి వైసీపీకి చెందిన వ్యక్తులెవరినైనా సభ్యత్వంగా తీసుకుంటే మర్యాదగా ఉండదని గట్టి వార్నింగ్ వంటి కౌన్సెలింగ్ ఇచ్చినట్టు రాజేష్ తెలిపారు. దీం తో జనసేన కార్యకర్తలు ఎన్నికల కమిషన్‌కు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. దీనిపై పోలీసు ఉన్నతాధికారులు విచారించి సీఐ కె.వేంకటేశ్వరావును వీఆర్‌కు పంపుతూ ఆదివారం ఆదేశాలు జారీ చేశారు. సీఐ ఆదివారం అందుబాటులో లేకపోవడంతో సోమవారం ఈ ఉత్తర్వులను సీఐకు అందజేశారు.ఇదిలా ఉండగా నిడదవోలుకు కొవ్వూరు రూరల్ సీఐను ఇన్‌చార్జిగా నియమించారు. వైసీపీకి చెందిన ఆమె వ్యవహారం కారణంగానే సీఐ వెంకటేశ్వరావు వీఆర్‌కు బదిలీ అయ్యారని ఇప్పటికే ఆమె వల్ల పార్టీకి ఎంతో నష్టం జరిగిందని ఇలాంటి సంఘటనలు ఎన్నికల సమయంలో పార్టీకి మరింత నష్టం వాటిల్లుతుందంటూ సొంత పార్టీ నేతలే వాపోతున్నారు. నిడదవోలు సీఐ కార్యాలయంలో ఇద్దరు సీఐలు వీఆర్‌కు వెళ్లడం వెనుక ఆమె కారణమని సమాచారం.

ఆదేశాలు నిజమే.. రామారావు, డీఎస్పీ

నిడదవోలు సీఐ వెంకటేశ్వరరావుపై జనసేన పార్టీ కార్యకర్తలు ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ అనంతరం జిల్లా పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సీఐ ను వీఆర్‌కు పంపుతూ ఆదేశాలు జారీ చేశారు.

సీఐ వేధించారు.. రాజేష్, జనసేన

నిడదవోలు సీఐ పిలిపించి వైసీపీ కుటుంబానికి చెందిన ఓ వ్యక్తిని నీ వెందుకు జనసేనలో జాయిన్ చేశావంటూ వేధించారు. దీనిపై ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశాను. విచారించి వీఆర్‌లోకి పంపారు.



- వైసీపీ పాలనలో అన్ని వర్గాలకు ఇబ్బందే
- ఉద్యోగులకు ఒకటో తేదీన జీతాల్లేవ్
- కాంట్రాక్టు కార్మికులకు హామీల అమల్లేవ్
- ధర్నాలు చేసినా పట్టించుకోని వైనం
- పింఛనుదారులకు వంచన
- దివ్యాంగులకు మొండిచేయి
- పెరిగిన అరాచకాలు
- ఇక చాలంటున్న ఓటర్లు
- ఉగాది వేళ కూటమి వైపు చూపు

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

"శతాయుర్వజ్ర దేహాయ సర్వ సంపత్కరాయచ! సర్వారిష్ట వినాశాయ నింబ కందళ భక్షణం!!" అనే శ్లోకాన్ని పఠిస్తూ ఉగాది రోజున షడ్రుచుల సమ్మేళన పచ్చడిని సేవిస్తారు.ఈ పచ్చడి వాత, పిత్త, శైత్య, వికార దోషాలను తొలగించి ఆరోగ్యం కలిస్తుందని వైద్య శాస్త్రం చెబుతుంది. అయితే జీవన సందేశాన్నిచ్చే మరో సత్యం కూడా ఈ శ్లోకంలో నిగూఢంగా ఇమిడి ఉంది. అదే.. ఆశావహ దృక్పథంతో 'మంచి' అందుకోవాలని.. జీవన గమనం 'తీపి'గా సాగాలని బోధిస్తుంది.యుగాదిగా పేరుగాంచి.. కాలక్రమేణ 'ఉగాది'గా తెలుగు వారింట తొలి పండుగగా స్థిరపడింది. ఈ సారి ఉగాదిని తీపిమయం చేసుకోవడం ఓటరు చేతిలోనే ఉంది. గత నాలుగున్నరేళ్లగా దగా పాలకుల వల్ల పరిస్థితులు చేదెక్కాయి.వైసీపీ అరాచక పాలనతో ఏ వర్గం కూడా సంతోషంగా లేదు. రోడ్డెక్కని ఉద్యోగి లేడు.. సమ్మె చేయని శ్రామికుడూ లేడు. అందుకే ఓటర్లు కూడా చేదు పోవాలి.. తీపి కావాలని కోరుకుంటున్నారు.

ఐదేళ్లుగా చేదుగా మారిన బతుకులు..

తెలుగు సంవత్సరంలో తొలి పండుగ ఉగాది. ఐదేళ్లుగా చేదుమయంగా మారిన జీవితాలను తీపిగా చేసుకోవడానికి ఈ ఉగాదితో ఓటర్లు నాంది పలకడానికి 'సిద్ధం'గా ఉన్నారు. వైసీపీ ప్రభుత్వం వచ్చాక ఉద్యోగస్తులకు సరిగా జీతాలందిన దాఖలాలు లేవు. సుమారు 40 ప్రభుత్వ శాఖలు ఉండగా పోలీస్ మినహా ఏ ఒక్క శాఖకూ ఒకటో తేదీన జీతం చేతిలో పడింది లేదు. పండుగ ఏదైనా అప్పులకు చేతులు చాపక తప్పలేదు. గతంలో ఎన్నడూ లేని విధంగా వేతనాలు క్రమం తప్పాయి. ఆర్థిక క్రమశిక్షణ గాడి తప్పడంతో జీతాలు భారంగా మారాయి. ఉపాధ్యాయులు మరీ చేదును దిగమింగారు. ఒకటో తేదీన జీతాలందక విలవిల్లాడిపోయారు.ఎన్నడూ లేనిది చివరకు ఒకటో తేదీన జీతాలు ఇవ్వండి మహాప్రభో అంటూ ధర్నాలు చేయడం గమనార్హం. శ్రామికులకు చేతిలో పని లేకుండాపోయింది. ప్రభుత్వం బిల్లులు చెల్లించకపోవడంతో అభివృద్ధి పనులూ అటకెక్కాయి. ఇలా వైసీపీ ప్రభుత్వ పాలనలో తీపి కరువై చేదుగా మారింది. లక్షల్లో ఉద్యోగాలంటూ గత ఎన్నికల్లో ఊదరగొట్టిన జగన్ తీరా అధికారంలోకి వచ్చాక వలంటీర్లని సొంత రాజకీయ సైన్యం తయారు చేసుకునే పని ప్రారంభించారు. దానికి 'సేవ' అని పేరు తగిలించారు.నాలుగున్నరేళ్లు ఊడిగం చేయించుకున్నారు. చివరికి ఎన్నికల వేళ తొలగించారు. ఇప్పుడు తమ సొంత సైన్యంలా చేసుకునేందుకు రాజీనామాలు చేయిస్తున్నారు.జగన్ మాటలతో దగా పడిన ఆశాలు, అంగన్వాడీలు, సమగ్ర శిక్షా ఉద్యోగులు, మధ్యాహ్న భోజన పథక కార్మికులను ఇబ్బంది పెట్టారు. ఎన్నో సార్లు నిరసన తెలిపినా ఆశాలు..అంగన్‌వాడీల వేదన జగన్ ప్రభుత్వానికి వినబడలేదు. సుమారు రెండు నెలల పాటు సమ్మెలో నలిగిపోయారు. అయినా లాభం లేదు.. జూన్ తరువాత చూద్దాం అంటూ సరిపెట్టారు. జూన్ తరువాత ఈయన చూసేదేమిటనేది ఆయా వర్గాల వాదన. 'సమగ్ర శిక్ష' సిబ్బంది బతుకులు ఇబ్బందులతో మరీ చేదుగా మారడంతో పెన్‌డౌన్ చేశారు. కేంద్రం తన వాటా నిధులను విడుదల చేస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం వాటిని దారి మళ్లిస్తుండడం ద్వారా సమస్యకు తెరలేపింది.పసిపిల్లలకు బుద్ధులు నేర్పుతున్న అంగన్వాడీ వర్కర్లు ప్రభుత్వానికి మాత్రం సుద్దులు నేర్పడానికి నానా తంటాలూ పడ్డారు. ఎన్నోసార్లు ప్రభుత్వానికి విన్నవించి చివరికి సమ్మెకు దిగారు. అయితే వీరిపై ప్రభుత్వం దాష్టీకానికి ఒడిగట్టింది. సెంటర్ల తాళాలను ప్రభుత్వ యంత్రాంగంతోనే బద్ధలు కొట్టించి భయభ్రాంతులకు గురిచేసింది. ప్రజాస్వామ్య చరిత్రలో ఒక ప్రభుత్వం ఉద్యోగులపై ఇంత చేదుగా ప్రవర్తించడం ఇదే తొలిసారి కావొచ్చు. ఉద్యోగాలు తీసేస్తామని బెదిరించారు. వారి డిమాండ్లకు నేటికీ అతీగతీ లేదు. సచివాలయ సిబ్బందికీ ఇబ్బందులు తప్పలేదు. ఎన్నికల నోటిఫికేషన్‌కి రోజులు దగ్గర పడుతున్న వేళ సచివాలయ సిబ్బంది సర్దుబాటును ప్రభుత్వం తెరపైకి తెచ్చింది. ఇప్పటికే సచివాలయ సిబ్బందిని 'అన్ని' పనులకూ వాడేస్తున్నారు. వైసీపీ సమావేశాలకు జనాలను తరలించడం.. చివరికి ఆడుదాం ఆంధ్రా ఆటలకు వీక్షకులను తీసుకొచ్చే పనిని సచివాలయ సిబ్బందికే అప్పగించారు. జగన్ సభలకైతే చెప్పనవసరం లేదు. ఆడుదాం ఆంధ్రా ఆటలను చూడడానికి జనాలను తీసుకురాకపోతే సస్పెండ్ చేస్తామంటూ ఏకంగా ఓ ఐఏఎస్ అధికారి ఆ చిరుద్యోగులపై బెదిరింపులకూ దిగారు. జాబ్ చార్టు ప్రకారం నిర్వర్తించాల్సిన విధుల కంటే అదనపు భారం ఉందని సచివాలయ సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్న తరుణంలో రేషనలైజేషన్ (సర్దుబాటు) అంటూ వాళ్లను మరింత ఆవేదనలోకి పాలకులు నెట్టేశారు. సచివాలయాల్లో 8-11 మంది ఉంటారని పాలకులు అధికారంలోకి వచ్చిన తొలినాళ్లలో చెప్పారు. ఇప్పుడు కొన్నింటిలో ఐదుగురే నెట్టుకొస్తున్నారు. పింఛను లబ్ధిదారులనూ వైసీపీ వంచన చేసింది.జిల్లాలో 32,597 మందికి పింఛను అందుతుండగా ఆ సంఖ్యను 32,442కి పరిమితం చేసి 1,022 కొత్తవి ఇచ్చినట్టు చూపించారు. దివ్యాంగులకు ఉండే ప్రత్యేక పరిస్థితుల వల్ల వాళ్లకు కాస్త ఎక్కువ మొత్తంలో పింఛను ఇచ్చేవారు. సాధారణ కేటగిరీలకు రూ.2వేలు ఇచ్చినా వారికి రూ.3వేలు ఇచ్చేవారు. కానీ ఇప్పుడు రూ.3 వేలు తీసుకునే వాళ్లతో వీరి పింఛను సమానమైపోయింది. చివరికి దివ్యాంగులనూ వంచన చేశారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన రోజు నుంచే విధ్వంసానికి తెరతీసింది.టీడీపీ హయాంలో నిర్మించిన ప్రజావేదికను నేలమట్టం చేయడంతో పాలన మొదలు పెట్టారు. దళితులపై దాష్టీకాలకు అంతులేదు.నా ఎస్సీలంటూనే దారుణాలు చేశారు. సీతానగరంలో ప్రసాద్ అనే యువకుడికి శిరోముండనం చేశారు. నల్లజర్ల పోలీస్ స్టేషన్ పరిధిలో రాజకీయ పందేరంలో ఒక యువకుడు ప్రాణాలు తీసుకున్నాడు. కరోనా సమయంలో మాస్కులు అడిగిన పాపానికి విశాఖలోని ఓ మంచి వైద్యుడిని పిచ్చివాడిగా చిత్రీకరించి వైసీపీ చంపేసింది. ఆ పార్టీ ఎమ్మెల్సీ అనంతబాబు చేసిన దారుణంపై దళితులు ఇప్పటికీ రగులుతూనే ఉన్నారు. దళితుడైన తన డ్రైవరును తీవ్రంగా చిత్రహింసలు పెట్టి చంపేసి మృతదేహాన్ని ఏకంగా కారులో ఇంటికి తీసుకెళ్లి పడేశాడు. ఇలా ప్రతీ వర్గం వైసీపీ చేతిలో దగా పడింది. ఇసుక, మట్టి వంటి వనరులను అక్రమంగా మింగేశారు. జిల్లాలోని పోలీసులతో కూడా వైసీపీ ఆడుకొంది.చోటామోటా కార్యకర్తలకు పోలీసులు భయపడాల్సిన పరిస్థితి తెచ్చింది. తమ 'మాట' వినని వాళ్లపై కక్ష సాధించింది. టీడీపీ నాయకులపై అక్రమంగా కేసులు బనాయించలేదని ఒక సీఐని అన్యాయంగా వీఆర్‌లోకి పంపింది. సెంట్రల్ జైలు సూపరింటెండెంట్, దళిత ఉద్యోగి రాజారావును ఆకస్మాత్తుగా బదిలీ చేసింది.టీడీపీ నేతలు జైలులో ఉన్నప్పుడు పరామర్శించడానికి వచ్చిన చంద్రబాబుకు ములాఖత్ ఇవ్వడమే ఆ ఉద్యోగి చేసిన తప్పు.ఇలా ఉద్యోగులు కిక్కురుమనడానికీ ఉలిక్కిపడే పరిస్థితులు తెచ్చింది.జీతాల్లేవు,టీఏ, డీఏ బిల్లులు రావు, తీవ్రమైన పనిఒత్తిడి, దారుణమైన రాజకీయ ప్రమేయం.. ఇలా ఈ ప్రభుత్వంలో ఉద్యోగులకు ఉద్యోగం చేదుగా మారింది. ప్రాణాలను మింగేస్తున్నా రోడ్లను మాత్రం బాగు చేయలేదు.వైసీపీ ప్రభుత్వంలో నాలుగున్నరేళ్లలో ప్రభుత్వ ఉద్యోగాలకు ఒక్క నోటిఫికేషనూ రాలేదు.చివరిలో జనాలను మభ్యపెట్టడానికి మెగా డీఎస్సీ అని దగా చేశారు. అప్పులు చేసి చేపలు చేతికిస్తూ ప్రభుత్వం పబ్బం గడుపుకొంది.

ఈ సారి తీపి రావాలని..

ఈసారి కచ్చితంగా మంచి గెలవాలి. తీపి రావాలని ప్రతి ఓటరూ ఎదురు చూస్తున్నాడు. గతంలో ఎన్నడూ లేని విధంగా నాలుగున్నరేళ్లుగా చేదును దిగమింగుతూ వస్తున్న జనం ఓటు వేసే రోజు కోసం ఎదురు చూస్తున్నారు.గత టీడీపీ ప్రభుత్వంలో ఉద్యోగులు ఇబ్బంది పడింది లేదు. ఒకవేళ సమస్య ఎక్కువైతే పాలకులు సర్దిచెప్పి వారి డిమాండ్లను నెరవేర్చడానికి ప్రయత్నించేవారు.ఇసుకను ఉచితంగా సరఫరా చేశారు. భవన నిర్మాణ సామగ్రి అందుబాటు ధరల్లో దొరకడంతో భవన నిర్మాణ కార్మికులకు చేతినిండా పని ఉండేది. ఆశాలు, అంగన్వాడీలు సమగ్ర శిక్షా వంటి ఉద్యోగులు దగా పడింది లేదు. వాస్తవానికి డ్వాక్రాలను టీడీపీ హయాంలోనే ప్రారంభించారు. సంఘటితంగా పొదుపు చేసుకున్న సంఘాలకు ప్రభుత్వం చేయూతను ఇచ్చి ఆర్థికంగా స్వావలంబన సాధించే దిశగా నడిపించేది. ఈసారి జనసేన, బీజేపీతో టీడీపీ పొత్తు కట్టింది. ప్రజా ప్రయోజనాలకు మూడు పార్టీలూ కలిసి అడుగులు వేస్తు న్నాయి. అభ్యర్థుల ఎంపికలోనూ ఆచితూచి వ్యవహరించారు. ప్రజా నిర్ణయమే శిరోధార్యంగా గెలుపు గుర్రాలను సిద్ధం చేశారు. దీంతో తీపి కబురు ఓటరు చేతిలోనే ఉందనే చర్చ నడుస్తోంది. టీడీపీ, జనసేన సూపర్ సిక్స్ ప్రకటించడంతో జోష్ జోరందుకొంది. ఈ నాలుగున్నరేళ్లలో దగా పడిన ప్రజా జీవనాన్ని మళ్లీ ప్రగతి పట్టాలెక్కించే దిశగా టీడీపీ, జనసేన, బీజేపీ కలిసి ముందుకు సాగుతున్నాయి. అవి తీపిని వాకిట్లోకి తీసు కొచ్చేందుకు శ్రమించినా ఆ మంచిని అందుకొనే నిర్ణయం ఓటరు చేతిలోనే ఉందనేది నిర్వివాదాంశం.



నేడు ఉగాది

నవ వసంతంలోకి అడుగుపెట్టబోతున్నాం..
తీపి.. చేదు కలిసిందే జీవితం..
కష్టం.. సుఖం తెలిసిందే జీవితం..
చేదు పోవాలి.. తీపి రావాలి..

నేడు (మంగళవారం) క్రోధినామ సంవత్సర ఉగాది సందర్భంగా ఇదే ప్రతి ఒక్కరి ఆశ .. తెలుగు ఏడాదిలోకి అడుగు పెడుతున్నాం. షడ్రుచుల సమ్మేళనంతో తెలుగు వారి జీవితాల్లో ఆనందోత్సాహాలు పూయించేందుకు వచ్చింది ఉగాది.. ఈ పండుగను ప్రతి ఇంటా తీపి,వగరు, చేదు, కారం, పులుపు, ఉప్పు కలిపి చేసిన ఉగాది పచ్చడితో ఆనందంగా జరుపుకుంటారు.. కొత్త ఏడాదికి స్వాగతం పలుకుతారు.. పండుగ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా ఆలయాలు ముస్తాబయ్యాయి. రాజమహేంద్రవరం మంగళవారపు పేటలో ఉగాదికి విశేష అలంకరణలో శ్యామలాంబ అమ్మవారు.

- రాజమహేంద్రవరం కల్చరల్

కూటమిని గెలిపిస్తేనే అభివృద్ధి

- సీఎం జగన్‌ను గద్దె దించాలి
- రాష్ట్ర పరిస్థితులే కూటమికి కారణం
- ఎన్నికల్లో త్రివేణి సంగమం
- అంతా ఐక్యంగా పనిచేయాలి
- అన్ని వర్గాలకు జగన్ అన్యాయం
- పంచాయతీ నిధులు మళ్లింపు
- నిధులు కేంద్రానివి..సోకు జగన్‌ది
- కొవ్వూరు సభలో పురందేశ్వరి ఫైర్



ఎన్‌టీఆర్ బిడ్డగా పుట్టడం నా అదృష్టం : కొవ్వూరు సమావేశంలో మాట్లాడుతున్న పురందేశ్వరి చిత్రంలో అచ్చిబాబు

కొవ్వూరు, ఏప్రిల్ 8 : రాష్ట్రాన్ని రక్షించుకోవాలి. దేశాన్ని అభివృద్ధిలో పరుగులు పెట్టించాలంటే కూటమి అభ్యర్థులను గెలిపించుకోవాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు,రాజమహేంద్రవరం పార్లమెంట్ అభ్యర్థి దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. కొవ్వూరు పరిమి రామారాయుడు రత్తమ్మ కల్యాణ మండపంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొమ్ముల దత్తు అధ్యక్షతన సోమవారం నిర్వహించిన టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి నాయకుల సమన్వయ కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు. మూడు పార్టీల కార్యకర్తలను చూస్తుంటే చంద్రబాబు యుక్తి, పవన్‌కల్యాణ్ శక్తి, నరేంద్రమోదీ స్ఫూర్తి కలిపి త్రివేణి సంగమాన్ని చూస్తున్నామన్నారు. రాష్ట్రంలో ఉన్న పరిస్థితుల కారణంగా కూటమిగా ఏర్పడ్డామన్నారు. ఎంతో చరిత్ర ఉన్న రాజమహేంద్రవరం పార్లమెంటుకి కూటమి అభ్యర్థిగా ప్రతిపాదించడం తన అదృష్టమన్నారు. నా బీసీలు, నా ఎస్సీలు, నా ఎస్టీలు అంటూ సీఎం జగన్ గుండెలు బాదుకుంటున్నారు..ఇవాళ ఏ వర్గానికి మీరు న్యాయం చేశారో చెప్పాలన్నారు.వైసీపీ ఎమ్మెల్సీ అనంతబాబు తన కారు డ్రైవరును హత్య చేసి ఇంటికి డోర్ డెలివరీ చేస్తే అతన్ని పక్కన కూర్చోపెట్టుకున్నారు.ఇది ఎస్సీలకు న్యాయం చేయడమా అని ప్రశ్నించారు. ఇటీవల అనంతబాబు గన్‌మెన్లు ఎస్సీ పురుషుడిని ఏ విధంగా కొట్టారో మనందరం చూశామన్నారు. ఇదా ఎస్సీలకు న్యాయం చేయడం. బీసీ వర్గాలకు న్యాయం చేయాలని కేంద్ర ప్రభుత్వం బీసీ కమిషన్‌కు చట్టబద్ధత కల్పిస్తే ఇవాళ రాష్ట్రంలో బీసీ కమీషన్‌కు కనీసం చట్టబద్ధత కల్పించలేని అసమర్థ ప్రభుత్వాన్ని రాష్ట్రంలో చూస్తున్నామన్నారు. బీజేపీ దేశంలో సాధారణ ఎస్టీ కుటుంబం నుంచి వచ్చిన ద్రౌపది ముర్మును రాష్ట్రపతిని చేస్తే రాష్ట్రంలో ఎస్టీ గోడు పట్టించుకునే నాథుడు లేడంటే ఎంత బాధాకరం అన్నారు. టిడ్కో గృహాలు శిథిలావస్థకు చేరాయి. పేద సోదరి పట్టా ఇచ్చారు స్థలం ఇవ్వలేదని మీడియా ముందు పట్టాను చించివేసిందంటే రాష్ట్ర ప్రభుత్వం ఎంత మోసం చేసిందో ఆలోచించండి అన్నారు. గ్రామీణాభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని కేంద్రం పంచాయతీలకు వేసిన 15వ ఆర్థిక సంఘం నిధులను దారి మళ్లించి గ్రామాల అభివృద్ధిని కుంటుపరిచారు. అప్పులు చేసి అభివృద్ధి పనులు చేసిన ఎందరో సర్పంచ్ సోదరులు బిల్లులు రాక ఆత్మహత్యలు చేసుకున్న సంఘటనలు రాష్ట్రంలో ఉన్నాయన్నారు. అమరావతి రైతులు బాధను చెప్పుకోవడానికి వస్తే కొవ్వూరు రోడ్డు కం రైలు బ్రిడ్జిని మూసివేసిన సంఘటన మనమందరం చూశాం. ప్రాంతీయ విద్వేషాలు రెచ్చగొట్టే విధంగా మూడు రాజధానులు అంటూ మూడుముక్కలాటను తెరపైకి తీసుకొచ్చిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌దేనన్నారు.ప్రతి ఎకరాకు రూ. పదమూడున్నర వేలు ఇస్తానన్నారు. ఈ రోజు ఎంతిచ్చారో గుండెల మీద చెయ్యి వేసుకుని చెప్పాలన్నారు. కేంద్రం ఇస్తున్న ఆరు వేలు కలుపుని రూ. 13 వేలు ఇచ్చి నేనే ఇస్తున్నానని చెప్పుకోవడానికి సిగ్గుగా లేదా అన్నారు. మోదీ 80 కోట్ల మందికి ఉచితంగా రేషన్ బియ్యం ఇస్తుంటే జగన్మోహనరెడ్డి ఒక బండి ఏర్పాటు చేసి తన బొమ్మ వేసుకుని ప్రచారం చేసుకోవడం అన్యాయం కాదా అన్నారు. మన ఆంధ్ర రాష్ట్రంలో త్రిపుల్ ఇంజను సర్కారు రాబోతుందన్నారు. మూడు పార్టీలు కూటమి కారణంగా చిన్నపాటి తేడాలు, విభేదాలు సహజమే.. వాటిని అధిగమించి లక్ష్యం సాధించాలన్నారు.పార్లమెంటు అభ్యర్థిగా తనను, అసెంబ్లీ అభ్యర్థిగా ముప్పిడి వెంకటేశ్వరరావును ఆశీర్వదించాలని కోరారు. కొవ్వూరు నియోజకవర్గ ఎన్డీఏ కూటమి ఉమ్మడి అభ్యర్థి ముప్పిడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ తల్లికి, చెల్లికి న్యాయం చేయలేని ముఖ్యమంత్రి మన రాష్ట్రం, మన పిల్లల భవిష్యత్ కోసం ఏం ఆలోచిస్తాడన్నారు. జగన్మోహనరెడ్డి ఒక సైకో. కరోనా కంటే డేంజర్ అన్నారు. 2004 ఎన్నికల్లో ఉన్న ఇళ్లు తాకట్టుపెట్టి వైఎస్ఆర్ నామినేషన్ వేశారని పెద్దలు చెబుతున్నారు. ఇదిలా ఉంటే పదేళ్ల కాలంలో దేశంలోని అందరూ ముఖ్యమంత్రుల్లో ధనవంతుడు జగన్మోహనరెడ్డి అని సర్వేలు చెబుతున్నాయన్నారు. అంటే ఈ రాష్ట్రాన్ని ఏ విధంగా దోచుకున్నారో ప్రజలు అర్థం చేసుకోవాలన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ కార్యకర్తలకు ఎటువంటి అపోహలు వద్దు అంతా ఒకే కుటుంబం అన్నారు. అందరూ కలిసికట్టుగా పనిచేయాలన్నారు. జగన్మోహనరెడ్డి ఆస్తులు కూడగట్టుకుని లండన్ వెళ్లిపోవాలని చూస్తున్నారు లండన్ కాదు ఎన్డీఏ కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే చంచల్‌గూడ జైలుకు పంపించాలన్నారు. టీడీపీ సీనియర్ నాయకులు పెండ్యాల అచ్చిబాబు మాట్లాడుతూ ఏసీ రూమ్‌లో కూర్చోవాల్సిన పవన్‌కల్యాణ్ లాంటి వ్యక్తులు రాష్ట్ర భవిష్యత్‌కై బయటకు వచ్చి పోరాటం చేస్తున్నారు ఆయనకు కులం అంటగట్టడం సరికాదు.. ఆయనను స్ఫూర్తిగా తీసుకుని మన పిల్లల భవిష్యత్ కొరకు మనందరం కలిసికట్టుగా కూటమి అభ్యర్థులను గెలిపించుకోవాలన్నారు. బీజేపీ రాష్ట్ర నాయకుడు పరిమి రాధ మాట్లాడుతూ జగన్మోహనరెడ్డి సంక్షేమం పేరుతో సంక్షోభం సృష్టిస్తూ రాబోయే తరాలను నాశనం చేసే విధంగా పాలన చేస్తున్న ముఖ్యమంత్రిని గద్దెదించాలన్నారు. మునిసిపాలిటీ, రెవెన్యూ డివిజన్ కేంద్రం నిర్వీర్యం అవుతుంటే పట్టించుకోని హోం మంత్రి వనిత పక్క నియోజకవర్గాన్ని ఏవిధంగా అభివృద్ధి చేస్తారో ఆలోచించుకోవాలన్నారు. కార్యక్రమంలో ద్విసభ్య కమిటీ సభ్యులు కంఠమణి రామకృష్ణారావు, జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి,మద్దిపట్ల శివరామకృష్ణ, గొర్రెలశ్రీధర్,సూరపనేని చిన్ని,బీజేపీ,జనసేన నాయకులు కోడూ రి లక్ష్మీనారాయణ, పిల్లలమర్రి మురళీకృష్ణ, బి.వి. ముత్యాలరావు,ఎం.రామచంద్రరావు,పిక్కి నాగేంద్ర, బూసి జెనర్జీ,మారిశెట్టి వెంకటేశ్వరరావు, ఉప్పులూరి రాజేంద్ర మునిప్రసాద్, డేగల రాము తదితరులు పాల్గొన్నారు.

రాజానగరంలో జరగని సమావేశం

కోరుకొండ, ఏప్రిల్ 8 : రాజానగరం నియోజకవర్గ స్థాయి బీజేపీ, టీడీపీ, జనసేన ఉమ్మడి ఆత్మీయ సమావేశం రసాభాసగా మారింది. బూరుగుపూడి ద్వారకామాయి గార్డెన్స్‌లో సోమవారం సాయంత్రం బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, రాజమహేంద్రవరం పార్లమెంట్ అభ్యర్థి పురందేశ్వరి నియోజకవర్గ నాయకులతో ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేశారు. అయితే సమావేశం ప్రారంభంలో వేదికపై కట్టిన బ్యానర్‌లో టీడీపీ రాజానగరం ఇన్‌చార్జ్ బొడ్డు వెంకటరమణ చౌదరి ఫొటో ముద్రించకపోవడంపై కొందరు టీడీపీ నాయకులు, కార్యకర్తలు వేదికపై ఉన్న నాయకులను ప్రశ్నించారు.ఏ పార్టీ ఇన్‌చార్జ్‌ల ఫొటోలు బ్యానర్‌పై ముద్రించడం లేదని కేవలం ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థి ఫొటోలు, పార్టీ అధినాయకుల ఫొటోలు మాత్రమే ముద్రిస్తున్నామని తాను రాజానగరం బీజేపీ ఇన్‌చార్జ్ అయినప్పటికీ తన ఫొటో కూడా ముద్రించుకోలేదని నీరుకొండ వీరన్న చౌదరి వివరణ ఇచ్చారు. అయినా టీడీపీ కార్యకర్తలు పట్టువీడలేదు. సమావేశాన్ని బహిష్కరించి బయటకు వెళ్లిపోతున్నట్టు ప్రకటించారు.ఈ నేపథ్యంలో బీజేపీ జిల్లా నాయకులు వేదికపై కట్టిన బ్యానర్‌ను తొలగించారు. ఇప్పుడు బ్యానర్ తీసేశాం కాబట్టి మీరు దయచేసి సహకరించాలని ఏదైనా తప్పు జరిగి ఉంటే క్షమించాలని బీజేపీ జిల్లా అగ్రనాయకులు వేదికపైనుంచి బహిరంగంగా క్షమాపణ చెప్పారు.అయినప్పటికీ టీడీపీ కార్యకర్తలు శాంతించలేదు.సమావేశపు ప్రాంతం నుంచి అరకిలోమీటరు దూరంలో ఉన్న టీడీపీ కార్యాలయానికి నినాదాలు చేసుకుంటూ వెళ్లిపోయారు. వేదికపై పురందేశ్వరి, జిల్లా నాయకులు మాత్రమే మిగిలారు. బీజేపీ నాయకుడు ఏపీఆర్ చౌదరి, ఎమ్మెల్యే అభ్యర్థి బత్తుల బలరామకృష్ణ టీడీపీ కార్యాలయానికి వెళ్లి నాయకులు,కార్యకర్తలను సుమారు రెండు గంటలు పాటు బుజ్జగించే ప్రయత్నం చేశారు.అయినా టీడీపీ నాయకులు, కార్యకర్తలు తిరిగి ఆత్మీయ సమావేశానికి రాలేదు.దీంతో రెండు గంటల పాటు బీజేపీ అధ్యక్షురాలు పురందేశ్వరి వేదికపైనే వేచి చూశారు.ఎమ్మెల్యే బుచ్చయ్యచౌదరి వచ్చి పురందేశ్వరితో మాట్లాడారు. అనంతరం ఆత్మీయ సమావేశంలో చిన్నచిన్న లోటుపాట్లు జరిగాయని, తదుపరి మరొకసారి టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీలతో సమన్వయం చేసుకుని ముందుకు వెళతామని చెప్పి పురందేశ్వరి సమావేశం నుంచి బయలుదేరి వెళ్ళారు. దీంతో సమావేశానికి వేలాదిగా వచ్చిన మూడు పార్టీల నాయకులు, కార్యకర్తలు నిరుత్సాహంగా వెనుదిరిగారు.



మేమంతా మీ వెంటే : కొవ్వూరు ఆత్మీయ సమావేశానికి హాజరైన మూడు పార్టీల నాయకులు, కార్యకర్తలు



కలెక్టర్ మాధవీలతకు వినతిపత్రం అందజేస్తున్న ఫ్యాప్టో నాయకులు

పోలింగ్ కేంద్రాల వద్ద జాగ్రత్తలు చేపట్టండి

అధిక ఉష్ణోగ్రతలపై ఐఎండీ హెచ్చరికలతో కలెక్టర్ ఆదేశం

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 8: అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్న తరుణంలో కేంద్ర, రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ఐఎండీ జారీ చేసిన హెచ్చరికల నేపథ్యంలో పోలింగ్ కేంద్రాల వద్ద తగు ఏర్పాట్లు చేస్తామని జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ కే.మాధవీలత తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆర్‌వోలకు,ఎన్నికల సిబ్బంది పలు ఆదేశాలు జారీ చేశారు. సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా వేసవి ఎండల ప్రభావాన్ని తగ్గించడానికి నియోజకవర్గ రిటర్నింగ్ అధికారులు తగిన ముందస్తు కార్యాచరణ ప్రణాళికలతో సిద్ధం కావాలని ఆదేశించారు.ఓట్లు వేయడానికి పోలింగ్ కేంద్రాలకు వచ్చే మహిళలు, వృద్ధులు ,దివ్యాంగులను దృష్టిలో పెట్టుకుని తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లో తగినంత వెంటిలేషన్ ఉండేలా చూసుకోవడం, తాగునీటి సదుపాయం, వడగాడ్పులకు గురైతే చికిత్స అందించడం,ప్రభుత్వ ఏజెన్సీలు, ఆరోగ్య విభాగం అత్యవసర సేవల విభాగాలతో సమన్వయం చేసుకోవాలన్నారు. అధిక ఉష్ణోగ్రతల నేపథ్యంలో చేపట్టిన భద్రత చర్యలపై విస్తృత ప్రచారం చేయాలన్నారు.

కలెక్టర్‌కు ఫ్యాప్టో వినతి

రాజమహేంద్రవరం అర్బన్, ఏప్రిల్ 8 : కొన్ని వర్గాలకు ఎన్నికల విధుల నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరుతూ కలెక్టర్ మాధవీలతకు సోమవారం ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ఫ్యాప్టో) తరపున వినతిప్రతం అందజేశామని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ.షరీఫ్ తెలిపారు. ఉపాధ్యాయులకు ఎన్నికల విధులు కేటాయింపులో దివ్యాంగులకు, గర్భిణులు, బాలింతలకు, తీవ్రమైన అనారోగ్యానికి గురైన వారికి వైద్య చికిత్సలు పొందుతున్న వారికి ఆరు నెలల్లోపు రిటైర్మెంట్ అయ్యే వారికి, స్టడీ లీవ్‌లో ఉన్న వారికి మినహాయింపు వర్తింపచేయాలన్నారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ ఎన్నికల విధులకు సంబంధించి ఉద్యోగుల కొరత ఉందని, ప్రత్యేకమైన మెడికల్ కారణాలు ఉన్న వారికి మాత్రం మినహాయింపు ఇస్తామని స్పష్టం చేశారన్నారు. మెడికల్ బోర్డు సిఫారసు ఆధారంగా మినహాయింపులు ఇస్తామన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్‌టీయూ ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్, ఏపీటీఎఫ్ 257 నాయకులు డి.దుర్గారావు, ఫ్యాప్టో కార్యవర్గ సభ్యులు ఎన్.రవిబాబు, కేవీఎస్ ప్రకాశరావు తదితరులు పాల్గొన్నారు.


చేబ్రోలులో పవన్‌కల్యాణ్ ఉగాది వేడుకల్లో పాల్గొనే ఇంటి వద్ద ఏర్పాటుచేసిన చలువ పందిరి

నేడు పవన్‌కల్యాణ్ రాక

- చేబ్రోలులో ఉగాది వేడుకల్లో పాల్గొననున్న జనసేనాని
- నూతన గృహ ప్రవేశం, ముస్తాబవుతున్న నివాస గృహం

గొల్లప్రోలురూరల్, ఏప్రిల్ 8: జనసేన అధినేత పవన్‌కల్యాణ్ మంగళవారం పిఠాపురం నియోజకవర్గానికి రానున్నారు. కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం చేబ్రోలులో జరగనున్న ఉగాది వేడుకల్లో ఆయన పాల్గొననున్నారు. పిఠాపురం నియోజకవర్గంలోని 54 గ్రామాల్లో ఏదోకచోట ఇల్లు తీసుకుని ఉంటానని చెప్పిన పవన్‌కల్యాణ్ అందుకు తగ్గట్టుగా చేబ్రోలు బైపాస్‌రోడ్డులో 216వ జాతీయరహదారి చెంతనే నూతనంగా నిర్మించిన గృహాన్ని అద్దెకు తీసుకున్నారు. పవన్ నివాసముండేందుకు అనువుగా ఇంటిని తీర్చిదిద్దారు. నూతన గృహ ప్రవేశం చేయనున్నారు. ఇక్కడే జనసేన కార్యాలయాన్ని ఏర్పాటు చేయనున్నారు. ఉగాది వేడుకలను ఇక్కడే జరుపుకుంటానని పవన్ ప్రకటించిన నేపథ్యంలో చేబ్రోలులోని నివాసంలో అందుకు తగ్గ ఏర్పాట్లు చేయడంలో జనసేన శ్రేణులు నిమగ్నమయ్యాయి. ఇప్పటికే ఇంటి వద్ద చలువ పందిరిని నిర్మించారు. మామిడి తోరణాలతో ఇంటిని అలంకరిస్తున్నారు. ఇంటి ఆవరణలో ఏర్పాటుచేసిన చలువ పందిరిలోనే పవన్ ఉగాది వేడుకల్లో పాల్గొంటారని జనసేన నాయకులు చెబుతున్నారు. పంచాంగ శ్రవణం జరుగుతుంది. మంగళవారం ఉదయం 10గంటలకు గొల్లప్రోలు హెలిప్యాడ్‌కు చేరుకుని అక్కడి నుంచి చేబ్రోలు నివాసానికి చేరతారని సమాచారం. ఇంటిలోకి కొబ్బరికాయ కొట్టి ప్రవేశిస్తారు. ఇప్పటికే చేబ్రోలు నివాసంవద్ద పవన్ వ్యక్తిగత భద్రతా సిబ్బంది మోహరించారు. పనులు చేస్తున్న వారిని మినహాయించి మిగిలిన వారిని లోపలకు అనుమతించడం లేదు.

పూల మార్కెట్‌కు ఉగాది శోభ


కడియపులంక పూలమార్కెట్‌లో విక్రయానికి సిద్ధంగా ఉన్న పూలు

కడియం, ఏప్రిల్ 8: కడియపులంక అంతర్రాష్ట్ర పూలమార్కెట్ ఉగాది శోభను సంతరించుకుంది. రెండురోజుల నుంచి పూల అమ్మకాలు ఊపందుకున్నాయి. వేసవి తీవ్రతతో దిగుబడులు తగ్గాయని రైతులు అంటున్నారు. దీంతో పూల ధరలు పెరిగాయి. ప్రస్తుతం కడియపులంక పూలమార్కెట్‌లో పూలధరలు ఇలా ఉన్నాయి. మ ల్లెలు (కిలో) రూ.800, లిల్లీ (కిలో)రూ.100, పసుపు చామంతి (కిలో) రూ.250-300, వైట్ చామంతి(కిలో) రూ.300-350, నీలం చామంతి(కిలో) రూ.300, పసుపు బంతి(కిలో) రూ.50-80, కలకత్తా బంతి(కిలో) రూ.80-100, స్టార్ గులాబీ(కిలో) రూ.250, డచ్ (20పూలు) రూ.300, కనకంబరం (బారు-1) రూ.120-130, దేశవాళీ గులాబీ (100 పూలు) రూ.100 ఉన్నాయి.

కాటన్ బ్యారేజ్ చెక్‌పోస్టు వద్ద తనిఖీల్లో
రూ.7 లక్షలు స్వాధీనం


ధవళేశ్వరంలో వాహన తనిఖీలు నిర్వహిస్తున్న పోలీస్ సిబ్బంది

ధవళేశ్వరం, ఏప్రిల్ 8: సాధారణ ఎన్నికలు సందర్భంగా కాటన్ బ్యారేజ్ సెంటర్‌లో ఏర్పాటుచేసిన చెక్‌పోస్టువద్ద సీఐ వినయ్‌మోహన్ ఆధ్వర్యంలో సోమవారం వాహనాలు తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా నిడదవోలు నుంచి కారులో ప్రయాణిస్తున్న జిల్లా కామన్ ఎగ్జామినేషన్ బోర్డు సెక్రటరీ డి.అనిత వద్దనుంచి రూ.7,07,500 నగదు స్వాధీనం చేసుకున్నారు. తదుపరి చర్యలు అనంతరం ఎఫ్ఎస్‌టీ టీంకు అప్పగించినట్టు ఎస్ఐ క్రాంతికుమార్ తెలిపారు.

పవరలో రూ.1.20 లక్షలు స్వాధీనం

సామర్లకోట, ఏప్రిల్ 8: కాకినాడ జిల్లా సామర్లకోట మండలం పవర గ్రామ పంచాయతీ కార్యాలయం సమీపాన ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు వాహనాలు తనిఖీలు చేస్తుండగా ఫకృద్దీన్ పాలెం గ్రామానికి చెందిన రెడ్డి గంగరాజు అనే వ్యక్తి ఎటువంటి పత్రాలు బిల్లులు లేకుండా తన వాహనంలో రూ.1.20లక్షల నగదు తీసుకెళ్తున్నట్టు గుర్తించి ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి పెద్దాపురం మండల వ్యవసాయాధికారి కె.సంజయ్‌కుమార్ స్వాధీనం చేసుకున్నట్టు పెద్దాపురం ఆర్వో సీతారామారావు వెల్లడించారు. ఈ మేరకు సోమవారం ఆర్వో మాట్లాడుతూ స్వాధీనం చేసుకున్న నగదును ట్రెజరీకి అప్పగించనున్నట్లు చెప్పారు.

అరచేతితో అడ్డుకుందాం..

- ఎన్నికల ఫిర్యాదులు.. సమాచారం కోసం ఏడు యాప్‌లు
- సామాన్య పౌరులను భాగస్వాములను చేస్తూ..
- కలెక్టర్ హిమాన్షు శుక్లా

అమలాపురం, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల్లో సామాన్య పౌరులను భాగస్వాములను చేస్తూ ఎన్నికల కమిషన్ పలు రకాల యాప్‌లను అందుబాటులోకి తీసుకువచ్చిందని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమజిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా సోమవారం తెలిపారు. ఎన్నికల ఫిర్యాదులు, సమాచారం కోసం ఏడు యాప్‌లను ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నామన్నారు. సార్వత్రిక ఎన్నికల నిబంధనావళి ఉల్లంఘన, ఇతర సమాచారల కోసం ఈ యాప్‌లను వినియోగించవచ్చు. సీ-విజిల్, సువిధ, కేవైసీ, అబ్జర్వర్, సాక్ష్యం, ఓటర్ హెల్ప్‌లైన్, నేషనల్ గ్రీవెన్స్ సర్వీస్ పోర్టల్ యాప్‌లు అందుబాటులో ఉన్నాయన్నారు. ఓటర్లకు అవసరమైన సాయం, కోడ్ ఉల్లంఘనపై ఫిర్యాదులు, ఎన్నికల ఖర్చు, పోలింగ్ బూత్‌ల వివరాలు, ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల గురించి సమాచారం తెలుసుకునేందుకు వీటిని ఉపయోగించుకోవచ్చునన్నారు.

నామినేషన్ల కోసం సువిధ యాప్

ఎన్నికల సమయంలో అభ్యర్థులు నామినేషన్ అనుమతి ప్రక్రియలో సహాయం చేసేందుకు సువిధ యాప్‌ను తీసుకువచ్చారు. పోటీచేసే అభ్యర్థులు ఖాతాను రిజిస్టర్ చేసుకుని వారి ఆధారాలతో లాగిన్ చేయాలి. ఆ తరువాత అభ్యర్థులు తమ నామినేషన్ల అనుమతిని యాప్‌లో చూసుకోవచ్చు. సువిధ క్యాండిడేట్ యాప్ అభ్యర్థులకు అనేక ఇతర ఫీచర్లు అందిస్తోంది. ప్రచారానికి అవసరమైన అనుమతుల గురించి తెలుసుకోవచ్చు.

ఎన్నికల ఉల్లంఘనలకు సీ-విజిల్ యాప్



ఎన్నికల ఉల్లంఘనలపై సాక్ష్యాలతో సహా ఈ యాప్‌లో పొందుపరచవచ్చు. ఫొటో, వీడియో, ఆడియో రూపంలో రికార్డింగుచేసి యాప్‌లో అప్‌లోడ్ చేయాలి. ఫిర్యాదు చేసిన ఐదు నిమిషాల్లో ఎన్నికల అధికారులు రంగంలోకి దిగుతారు. దీనిపై విచారణ జరిపి వంద నిమిషాల్లో ఫిర్యాదుపై ఖచ్చితమైన చర్యలు తీసుకుంటారు. పార్టీలకు అతీతంగా ఎవరు ఉల్లంఘనలకు పాల్పడ్డా ఫిర్యాదు చేయవచ్చు. గూగుల్ ప్లేస్టోర్ నుంచి యాప్‌ను డౌన్లోడ్ చేసుకోవాలి. ప్రధానంగా ఎన్నికల్లో డబ్బులు పంపిణీ, బహుమతుల అందజేత, రెచ్చగొట్టే ప్రకటనలు, మత్తు పదార్థాల పంపిణీ, ఓటర్లను ప్రభావితం చేయడం, ఎన్నికల రోజు ఓటర్లను వాహనాల్లో తరలించడం. ఇటువంటి ఉల్లంఘనలను ఫొటో, వీడియో, ఆడియోలో క్లిప్‌లు అప్‌లోడ్ చేయాలి. వెంటనే జిల్లా ఎన్నికల అధికారి స్పందించి ఫిర్యాదుదారునికి తీసుకున్న చర్యలపై తెలుసుకునేవిధంగా వెసులుబాటు కల్పించారు.

ఓటరు హెల్ప్‌లైన్ యాప్



ఓటరు హెల్ప్‌లైన్ యాప్‌లో కొత్త ఓటర్ల నమోదు చేసుకోవచ్చు. ఓటర్ల జాబితాలో జనాభా వివరాలు, ఎన్నికల ప్రవర్తనా నియమావళికి సంబంధించి ఫిర్యాదుల స్వీకరణకు ఈ యాప్ ఉపయోగపడుతుంది.

నేషనల్ గ్రీవెన్స్ సర్వీస్ పోర్టల్

ఎన్నికలకు సంబంధించిన ఫిర్యాదుల పరిష్కారానికి, ఈసీకి సహాయం చేయడంలో నేషనల్ గ్రీవెన్స్ సర్వీస్ పోర్టల్ కీలకపాత్ర పోషిస్తోంది. ఓటరు తమ మొబైల్ నంబరు ఉపయోగించి పోర్టల్‌లో వారి ప్రొఫైల్ నమోదు చేసుకోవచ్చు. ఓటరు తమ ఫిర్యాదును నమోదుచేసిన తరువాత విచారణ కోసం ఎన్నికల అధికారికి పంపిస్తారు. నిర్ణీత వ్యవధిలోగా అధికారులు స్పందించి చర్యలు తీసుకుంటారు. పోలింగ్ బూత్ స్థానాలు, ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు, ఎన్నికల ఖర్చు, ఎన్నికల అక్రమాలకు సంబంధించిన ఫిర్యాదులను సకాలంలో ఈ యాప్ పరిష్కరిస్తోంది.

దివ్యాంగుల కోసం సాక్ష్యం యాప్



విభిన్న ప్రతిభావంతులైన దివ్యాంగులు ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవడంలో అవసరమైన వసతులు పొందేందుకు సాక్ష్యం యాప్‌ను అందుబాటులోకి తెచ్చారు. దివ్యాంగులకు వీల్‌చైర్లు ఏర్పాటు చేయడంతో పాటు ఇతర వసతుల కోసం ఈ యాప్‌లో నమోదు చేసుకోవాలి. సంబంధిత అధికారులు దివ్యాంగులకు అవసరమైన అన్ని వసతులను కల్పించి ఓటు హక్కును సద్వినియోగం చేసుకునే విధంగా యాప్ ఉపకరిస్తుంది.

సీపీఐ(ఎం) ఎమ్మెల్యే అభ్యర్థిగా లోతా రామారావు




రంపచోడవరం, ఏప్రిల్ 8: రంపచోడవరం సీపీఐ(ఎం) ఎమ్మెల్యే అభ్యర్థిగా లోతా రామారావు పేరును ఆ పార్టీ సోమవారం ఖరారు చేసింది. రాజవొమ్మంగి మండలం లోదొడ్డి పంచాయతీ కేశవరం గ్రామానికి చెందిన లోతా రామారావు ప్రస్తుతం గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగాను, రాజవొమ్మంగి మండలం లోదొడ్డి సర్పంచ్‌గాను ఉన్నారు. రామారావు గత కొన్నేళ్లుగా ప్రజాసమస్యలపై గిరిజన సంఘం, సీపీఎం పార్టీల తరుపున పోరాటాలు చేస్తున్నారు. ప్రస్తుతం కాంగ్రెస్, సీపీఐ(ఎం), సీపీఐ పార్టీల పొత్తులో భాగంగా రంపచోడవరం నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా లోతా రామారావు పోటీ చేయనున్నారు.

కిక్ బాక్సింగ్ విజేతకు నగదు ప్రోత్సాహకం


బహుమతిని అందజేస్తున్న వీసీ పద్మరాజు

దివాన్‌చెరువు, ఏప్రిల్ 8: అఖిల భారత విశ్వవిద్యాలయాల కిక్ బాక్సింగ్ చాంపియన్ షిప్‌లో ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయానికి కాంస్య పతకం సాధించిన సీహెచ్ దినేష్‌కు రూ.20 వేల నగదు ప్రోత్సాహకాన్ని వీసీ ఆచార్య కె.పద్మరాజు సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ మీరట్‌లోని స్వామీ వివేకానంద సుబర్తి విశ్వవిద్యాలయంలో జరిగిన చాంపియన్‌షిప్‌లో దినేష్ 81 కిలోల విభాగంలో కాంస్య పతకాన్ని కైవసం చేసుకు న్నారన్నారు. దినేష్ నన్నయ అనుబంధ కళాశాలయైన రాజోలు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చదువుతున్నాడని తెలిపారు. ప్రతిభా వంతులైన క్రీడాకారులకు విశ్వవిద్యాలయం సహాయ సహకారాలు అందిస్తుందన్నారు. కార్యక్రమంలో క్రీడాబోర్డు కార్యదర్శి బి.రామ్ గోపాల్, కిక్ బాక్సింగ్ కోచ్ ఎం.భవానీశంకర్ పాల్గొన్నారు.



స్వయంభు తలుపులమ్మ తల్లి, నిర్మాణంలో ఉన్న మహా మండపం


పనులు పర్యవేక్షిస్తున్న ఆలయ ఇన్‌చార్జ్ డీసీ

నేటి నుంచి లోవతల్లి దర్శనం

- 15 నెలలుగా బాలాలయంలోనే దర్శనం

తుని రూరల్, ఏప్రిల్ 8: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం లోవ దేవస్థానం భక్తుల అవసరాలకు అనుగుణంగా ఆలయ పునఃనిర్మాణ పనులు చేపట్టడంతో గత 15నెలలుగా అమ్మవారు బాలలయంలోనే దర్శనమిస్తున్నారు. 4అంతస్తుల మహా మండపం, 9 అంతస్తుల రాజగోపురం నిర్మాణంతో పనులు చివరికి చేరడంతో అమ్మవారి ప్రధాన గర్భాలయంలో అమ్మవారి పునఃదర్శనాలు మంగళవారం నుంచి ప్రారంభించనున్నట్లు ఇన్‌చార్జ్ డిప్యూటీ కమిషన్ డి.విశ్వనాధ్‌రాజు తెలిపారు. మంగళవారం నుంచి ఐదురోజులు మహిళా భక్తులచే కుంకుమ పూజలు నిర్వహించనున్నారు.

4 అంతస్తుల మహా మండపం

ఆలయంలో పూర్వం ఉన్న క్యూలైన్‌లు తొలగించి ఆ స్థానంలో 4అంతస్తుల మహామండపం నిర్మిస్తున్నారు. మొదటి మండపంలో వినాయకుడి గుడి, టిక్కెట్ కౌంటర్లు ఏర్పాటు చేయనున్నారు. 2వ మండలం షాపింగ్ కాంప్లెక్స్‌లు, 3వ మండపంలో భక్తులు వేచి ఉండేందుకు క్యూ కాంప్లెక్స్‌లు, 4వ మండపంలో అమ్మవారి పంచలోహ విగ్రహాల ఏర్పాట్లు, గర్భాలయంలో అమ్మవారిని దర్శించుకున్న తరువాత ఆశీర్వాదాలకు, పర్వదినాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. 9 అంతస్తుల రాజగోపురం నుంచి దిగువకు మెట్లు నిర్మిస్తున్నారు. ప్రస్తుత రాజగోపుర నిర్మాణం దక్షిణం నుంచి తాత్కాలిక మెట్ల మార్గాన్ని ప్రధాన గర్భాలయంకు వెళ్లేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. 15 నెలలు తరువాత అమ్మవారి దర్శన భాగ్యం కలుగనుండటంతో ఆలయంలో రద్దీ ఏర్పడే అవకాశం ఉంది. అందుకు అనుగుణంగా ఆలయ ఈవో సిబ్బందితో చర్చించి ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నట్లు తెలిపారు.

కొత్త సంవత్సరంలో..
గృహనిర్మాణశాఖ ఉద్యోగులకు జీతాలు అందేనా!

- అయోమయ పరిస్థితిలో ఉద్యోగులు

అమలాపురంరూరల్, ఏప్రిల్ 8: నేటి నుంచి శ్రీక్రోధి నామ సంవత్సరం ప్రారంభమవుతుంది. కొత్త సంవత్సరంలోనైనా జీతాలు విడుదల అవుతాయో లేదో తెలియని అయోమయ పరిస్థితి గృహనిర్మాణశాఖలో నెలకొంది. గృహ నిర్మాణశాఖలో పనిచేస్తున్న అధికారులు, సిబ్బందికి ఈ నెలలో ఎనిమిది రోజులు గడిచిపోయినా ఇంత వరకు జీతాలు విడుదల చేయలేదు. అసలు ఈ నెలకు జీతాలు అందుతాయో లేదో తెలియని అయోమయ పరిస్థితి నెలకొంది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో గృహనిర్మాణ శాఖలో పనిచేస్తున్న ఉద్యోగులకు ఫిబ్రవరి, మార్చి నెలల జీతాలు విడుదల కాకపోవడంతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఫిబ్రవరి నెలకు సంబంధించి గృహనిర్మాణశాఖలో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ కంప్యూటర్ ఆపరేటర్లు, వర్కింగ్ ఇన్‌స్పెక్టర్లకు మాత్రం మార్చి నెలలో జీతాలను చెల్లించారు. వారికి మార్చినెల జీతాలు విడుదల కాలేదు. గృహనిర్మాణశాఖలో ఉమ్మడి జిల్లాలో పనిచేస్తున్న రెగ్యులర్ ఉద్యోగులకు, ఇతర సిబ్బందికి జీతాలను ప్రభుత్వం ఎప్పుడు విడుదల చేస్తుందో తెలియని అయోమయ పరిస్థితి. గత కొంతకాలంగా ఇదే పరిస్థితి నెలకొంది. జీతాలు సకాలంలో విడుదల కాకపోవడంతో ఈఎంఐలు సకాలంలో చెల్లించక ఉద్యోగులు, సిబ్బంది బ్యాంకులకు డిఫాల్టర్లుగా మిగిలిపోతున్నామని ఆ శాఖ ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు. ప్రతీనెలా అప్పులుచేసి కుటుంబాలను గడుపుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని సిబ్బంది ఆందోళన చెందుతున్నారు.

ఇద్దరు దింపు కార్మికుల మృతి

మలికిపురం, ఏప్రిల్ 8: గుడిమెళ్లంక గ్రామంలో నివాసం ఉంటున్న ఇద్దరు దింపు కార్మికులు వృత్తి రీత్యా పశ్చిమగోదావరి జిల్లా కాజా వైపు వెళుతుండగా పాలకొల్లు వైపు నుంచి వస్తున్న కారు వేగంగా వచ్చి వీరు ప్రయాణిస్తున్న మోటారు సైకిల్‌ను ఢీకొనడంతో సంఘటనా స్థలంలోనే వారు మృతిచెందినట్టు తెలిసింది. విశాఖ జిల్లా నక్కపల్లికి చెందిన కడియాల పెదమణియ్య(42), గూడి అప్పారావు(56)లు 15సంవత్సరాల క్రితం వృత్తి రీత్యా గుడిమెళ్లంక వచ్చి స్థిరపడ్డారు. దింపు పని కోసం వెళుతుండగా సోమవారం ఈ సంఘటన జరిగింది. అప్పారావుకు భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. పెదమణియ్యకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఈ ప్రమాదం ఘటన తెలిసిన వెంటనే స్థానికంగా ఉంటున్న సహచర దింపు కార్మికుల్లో విచారం అలుముకుంది.

21 టన్నుల రేషన్ బియ్యం పట్టివేత

నల్లజర్ల, ఏప్రిల్ 8: అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్న లారీని సీజ్‌చేసినట్టు సివిల్ సప్లై డీటీ సత్యనారాయణ తెలిపారు. సోమవారం ఉదయం సివిల్ సప్లై, దేవరపల్లి పోలీసులు సంయుక్తంగా వాహన తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో ఖమ్మం నుంచి కాకినాడకు లారీలో 21 టన్నులు రేషన్ బియ్యం తరలిస్తున్నట్టు గుర్తించారు. అక్రమంగా పీడీఎస్ బియ్యం తరలిస్తున్న వ్యక్తులపై కేసు నమోదు చేసి, బియ్యాన్ని గోపాలపురం ఎంఎల్ఎస్ పాయింట్‌కు తరలించారు.

యువకిడి ఆత్మహత్య


పాండ్రేకుల మహేష్

- స్నేహితుడి జ్ఞాపకాలు మరువలేక

యానాం, ఏప్రిల్ 8: యానానికి చెందిన యువకుడు తన స్నేహితుడి జ్ఞాపకాలు మరువలేక ఆత్మహత్య చేసుకున్నాడు. యానాం కుమ్మర్ల వీధికి చెందిన పాండ్రేకుల మహేష్(25) హైదరాబాద్‌లోని సాఫ్ట్‌వేర్ కంపెనీలో పనిచేస్తున్నాడు. మహేష్ స్నేహితుడు చిక్కాల రత్నాకర్ గత ఏడాది ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ప్రాణస్నేహిడుతు ఆత్మహత్య మహేష్‌ను కొంత కలవరానికి గురిచేసింది. ఈనెల 4న రత్నాకర్ సంవత్సరికానికి హైదరాబాద్ నుంచి మహేష్ యానాం వచ్చాడు. స్నేహితుడి జ్ఞాపకాలతో మనస్తాపానికి గురైన మహేష్ ఆదివారంరాత్రి 11గంటల సమయంలో తాను చనిపోతున్నానని మరో మిత్రుడికి ఫోన్‌లో మెస్సేజ్ పంపాడు. విషయం కుటుంబ సభ్యులకు తెలియడంతో రాత్రంతా యానాం గోదావరి పరిసరాల్లో గాలించారు. కనకాలపేట సమీపంలో మహేష్ చెప్పులు, సెల్‌ఫోన్‌ను గుర్తించారు. మత్స్యకారుల సహాయంతో గాలించగా సోమవారం ఉదయం మృతదేహం లభ్యమైంది. మృతదేహం వద్ద తల్లిదండ్రులు, బంధువులు బోరున విలపించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రాణం తీసిన స్నానం సరదా

- గోదావరిలో జారి యువకుడు మృతి


అశోక్‌కుమార్ (ఫైల్‌ఫోటో)

కడియం/ధవళేశ్వరం, ఏప్రిల్8: సరదాగా స్నేహితులతో కలిసి ఓ యువకుడు గోదావరి స్నానానికి వెళ్లాడు. ప్రమాదవశాత్తూ కాలుజారి ధవళేశ్వరం వద్ద గోదావరిలో గల్లంతయ్యాడు. స్థానికుల కథనం ప్రకారం.. కడియం మండలం దుళ్లకు చెందిన బర్నికల అశోక్‌కుమార్(18) తన స్నేహితులతో కలిసి ఆదివారం సాయంత్రం ధవళేశ్వరంవద్దకు గోదావరి స్నానానికి వెళ్లాడు. స్నానానికి దిగుతుండగా నాచుకు జారి గల్లంతయ్యాడు. స్నేహితులు గమనించి కేకలు వేయడంతో స్థానికులు వచ్చి అశోక్ మృతదేహాన్ని బయటకు తీశారు. ధవళేశ్వరం ఏఎస్ఐ శివాజీ సంఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజమహేంద్రవరం ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు. అశోక్‌కు తల్లిదండ్రులతోపాటు పెళ్లి కావలసిన అక్క ఉన్నారు. అశోక్ పదో తరగతి చదువుతుండగా తండ్రి రాజు అనారోగ్యానికి గురికావడంతో చదువుకు స్వస్తి చెప్పి తాపీ పనిలో చేరాడు. అప్పటి నుంచి కుటుంబ భారమంతా తానే మోస్తున్నాడు. కుమారుడి మృతితో కుటుంబ సభ్యుల రోధనలు మిన్నంటాయి.


హంస వాహనంపై ఊరేగుతున్న స్వామివారి

ఘనంగా అధ్యయనోత్సవాలు

- హంస వాహనంపై విహరిస్తున్న శ్రీవారు

ఆత్రేయపురం, ఏప్రిల్ 8: కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో వార్షిక కల్యాణోత్సవాలకు ముందుగా నిర్వహించే అధ్యయనోత్సవాలు సోమవారం నాలుగవ రోజుకు చేరుకున్నాయి. క్షేత్రంలోని ముఖమండపంలో చతుర్వేద పారాయణం, ద్రవిడవేద పారాయణం వేదపండితులచే ఘనంగా నిర్వహించారు. స్వామివారికి అర్చక బృందం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం పల్లకి మహోత్సవం కన్నుల పండుగగా జరిగింది. రాత్రి గరుడ, సింహ, హంస వాహనాలపై స్వామివారు తిరువీధులలో విహరించి భక్తులకు కృపకటాక్షాలు అందించారు. మేళతాళ మంగళవాయిద్యాలు, బాణాసంచా కాల్పుల నడుమ గ్రామోత్సవం ఘనంగా నిర్వహించారు. చంగోలం పారాయణం, నీరాజన మంత్రపుష్పం కార్యక్రమాలను శాస్రోక్తంగా నిర్వహించారు. ఆలయ ఉపకమీషనర్, ఈవో భూపతిరాజు కిషోర్‌కుమార్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

అనంతబాబుపై ఎస్సీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలి

- సీపీఎం నాయకుల డిమాండ్


సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం నాయకుడు కొమరం పెంటయ్య

కూనవరం, ఏప్రిల్ 8: ఎమ్మెల్సీ అనంతబాబుపై ఎస్సీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని సీపీఎం నాయకులు కొమరం పెంటయ్య, మండల కార్యదర్శి పాయం సీతారామయ్య అన్నారు. పార్టీ కార్యాలయంలో జరిగినవిలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రశాంతంగా ఉన్న ఏజెన్సీలో అనంతబాబు అలజడి సృష్టిస్తున్నారన్నారు. ఎన్నికల ప్రచారం పేరుతో ఈ ప్రాంతంలో పర్యటించి అమాయక గిరిజనులపై దాడులు జరిపించడం ఎంతవరకు సమంజసమని వారు ప్రశ్నించారు. రాత్రి వేళల్లో పర్యటించి తమ హక్కుల కోసం ప్రశ్నించిన రాము, వినోద్‌పై పోలీసుల చేత దారుణంగా కొట్టించారన్నారు. పోలీసులు సైతం అత్యుత్సాహం ప్రదర్శించి అమాయక గిరిజనులను కొట్టడం ఎంతవరకు న్యాయమన్నారు. ఇప్పటికే దెబ్బలు తిన్న యువకులను పోలీసులు స్టేషన్‌కు పిలిపించి వారిని బెదిరించే ధోరణిలో మాట్లాడి కేసును పక్కదారి పట్టించారన్నారు. దీనిపై త్వరలోనే ఎన్నికల కమిషన్‌ను, పోలీసు ఉన్నతాధికారులను కలిసి న్యాయం జరిగే వరకు పోరాటం సాగిస్తామన్నారు. సీపీఎం జిల్లా నాయకులు మేకల నాగేశ్వరరావు, తాళ్ళూరి శ్రీనివాసరావు, బొర్రయ్య, కర్నాటి శ్రీనివాసరావు, మురళీ, పాయం సత్యనారాయణ పాల్గొన్నారు.

రంప దేశం టికెట్‌ను పార్టీలో పనిచేసే వారికే ఇవ్వాలి

- మాజీ ఎమ్మెల్యేలు వంతల, శీతంశెట్టి డిమాండ్
- పార్టీ పరిశీలకుడు తీరుపైనా అధిష్టానానికి ఫిర్యాదు


రంపచోడవరంలో మాట్లాడుతున్న వంతల, శీతంశెట్టి

రంపచోడవరం, ఏప్రిల్ 8: రంపచోడవరం అసెంబ్లీ టికెట్‌ను టీడీపీలో పనిచేసిన వారికి మాత్రమే కేటాయించాలని రంపచోడవరం మాజీ ఎమ్మెల్యేలు వంతల రాజేశ్వరి, శీతంశెట్టి వెంకటేశ్వరరావు, రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు గొర్లె సునీత డిమాండ్ చేశారు. సోమవారం రంపచోడవరంలోని ఆర్యా అతిథి గృహ ఆవరణలో జరిగిన సమావేశ అనంతరం మీడియాతో మాట్లాడుతూ ఇక్కడ అభ్యర్థిని మార్చాలని కోరారు. ఇక్కడ అభ్యర్థిత్వం విషయంలో వివాదం పార్టీ అధినేత చంద్రబాబు పరిశీలనలో ఉండగా ఇక్కడ పార్టీ పరిశీలకుడు తన పరిధిని దాటి తానే అధిష్టానం అన్నట్టుగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. పరిశీలకుడిగా ఇక్కడి వ్యవహారాలను పరిశీలించి, నివేదించాల్సిన బాధ్యతను విస్మరించి నాయకులను సస్పెండ్ చేస్తానంటూ బెదిరిస్తున్నారని ఆరోపించారు. ఎన్నికల సమయం దగ్గర పడిన నేపథ్యంలో ఇక్కడ పరిస్థితులను చక్కదిద్ది పార్టీలో పనిచేసిన వారికే టికెట్‌ను కేటాయించాలని కోరారు.

తూర్పుగోదావరి

• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి • కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం

ఏజెన్సీ సమాచారం

ఈవీఎం, వీవీ ప్యాడ్‌లపై అవగాహన

రంపచోడవరం, ఏప్రిల్ 8: సెక్టారు, రూట్ అధికారులు ఈవీఎంలు, వీవీ ప్యాడ్లపై పూర్తిస్థాయిలో అవగాహన కలిగి ఉండాలని డిప్యూటీ తహశీల్దారు పి.రామకృష్ణ అన్నారు. సోమవారం స్థానిక ఐటీడీఏ కార్యాలయ సమావేశపు హాలులో సబ్ కలెక్టరు ఎస్.ప్రశాంత్ కుమార్ ఆదేశాల మేరకు ఈవీఎంలు, వీవీ ప్యాడ్లపై అధికారులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డీటీలు ఎన్‌వీవీ సత్యనారాయణ, సుబ్బారావు, చైతన్య, శివ, స్వామి, విశ్వనాథం, శ్రీధర్, ఆర్ఐ విగ్నేష్, సీనియర్ అసిస్టెంట్ లక్ష్మణ్ పాల్గొన్నారు.

రేపటి నుంచి గండిపోశమ్మ జాతర

దేవీపట్నం, ఏప్రిల్ 8: అల్లూరిజిల్లాలోని దేవీపట్నం మండలం గొందూరు గ్రామంలో వెలసిన గండాలు గట్టెక్కించే కొండతల్లి మాతృశ్రీ గండిపోశమ్మతల్లి 100 సంవత్సరాలకుపైగా నిత్య పూజలందుకుంటుంది. 1990 ఉగాది నుంచి దేవదాయ ధర్మాదాయశాఖ పరిపాలన పరిధిలోకి వచ్చిన నాటి నుంచి ప్రతీ ఉగాది మరుసటిరోజునుంచి ఐదురోజులపాటు గండిపోశమ్మతల్లి జాతర మహోత్సవాలు జరుపుతుంటారు. ఈనెల 10న గురువారంనుంచి 14 వరకు జాతర జరుగుతుందని ఆలయ కార్యనిర్వాహణాధికారి గండి వెంకటలక్ష్మికుమార్ తెలిపారు.

జాతరకు ముత్యాలమ్మ ఆలయం ముస్తాబు

వరరామచంద్రాపురం, ఏప్రిల్ 8: ఉగాది సందర్భంగా ముత్యాలమ్మ జాతరకు ముత్యాలమ్మవారి ఆలయాలు ముస్తాభయ్యాయి. వీఆర్ పురం, రేఖపల్లి ప్రధాన రహదారి ప్రక్క నున్న కట్టముత్యాలమ్మవారి ఆలయం, గుట్టపై ఉన్న గుణంకొండ ముత్యాలమ్మవారి ఆలయాలు గిరిజన సాంప్రదా యబద్ధంగా జరిగే ముత్యాలమ్మ జాతరకు అన్ని ఏర్పాట్లు అయా ఆలయ ఉత్సవ కమి టీ సభ్యులు చేశారు. భక్తుల కోసం మంచినీటి సౌకర్యాలు చలువ పందిళ్లు ఏర్పాటుచేశారు.

మోతుగూడెంలో నూకాలమ్మ జాతర

మోతుగూడెం, ఏప్రిల్ 8: చింతూరు మండలం మోతుగూడెంలో సోమవారం 49వ నూకాలమ్మ జాతర మహోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ప్రజలు అమ్మవారిని మేళతాళాలతో మోతుగూడెం పురవీధుల్లో ఊరేగించారు. అంతకుముందు శ్రీశ్రీశ్రీ నూకాలమ్మ ఆలయంలో ప్రధాన అర్చకుడు అయినవిల్లి కుమార్ స్వామిశర్మ ఆధ్వర్యంలో ఉదయాన్నే అమ్మవారికి పంచామృతాలతో అభిషేకాలు ప్రత్యేకపూజలు చేశారు. అమ్మవారికి పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. ఐదు రోజులు గరగలతో ఊరేగింపు నిర్వహిస్తారన్నారు. ఆలయ కమిటీ సభ్యులు కసింకోట నూకరాజు, పరిమళ దేవుడు, కసిం కోట చిట్టిబాబు, సన్యాసిరావు, హేమంత్, లోవరాజు, శివ సతిష్బాబు, రవి పాల్గొన్నారు.

టీడీపీ, బీజేపీ, జనసేన సమన్వయ కమిటీ సమావేశం

రంపచోడవరం, ఏప్రిల్ 8: సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ, బీజేపీ, జనసేన బలపర్చిన అభ్యర్థులు గెలుపే లక్ష్యంగా పనిచేయాలని ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి మిరియాల శిరీషదేవి అన్నారు. సోమవారం స్థానిక భాను కళ్యాణ మండలంలో ఆమె అధ్యక్షతన సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శిరీషదేవి మాట్లాడుతూ రంపచోడవరంలో టీడీపీ జెండాను ఎగురవేయాలని కోరారు. ఎన్డీఏ కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

వలంటీర్ల రాజీనామాలు...?

రాజవొమ్మంగి, ఏప్రిల్ 8: మండలంలో గ్రామ వలంటీర్ల మూకుమ్మడి రాజీనామాల పర్వం మొదలైనట్లు సమాచారం. మండలంలో 268 మంది గ్రామ వలంటీర్లు ఉండగా ప్రస్తుతం ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో వలంటీర్లను పలు విధులకి దూరం చేస్తూ ఎన్నికల కమీషన్ ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. అయితే వైసీపీ నాయకులు, కార్యకర్తల కంటే ప్రజలు గ్రామ వలంటీర్ల మాటే వింటారనే ఆలోచనలో ఉన్న వైసీపీ నాయకులకు వలంటీర్లు ప్రచారంలో పాల్గొనకూడదనే మాటతో సతమతమవుతున్నారు. దీంతో ఇప్పటికే పలు ప్రాంతంలో కొనసాగుతున్న గ్రామ వలంటీర్ల రాజీనామాల పర్వానికి రాజవొమ్మంగి మండలంలో శ్రీకారం చుట్టనున్నారు.

గ్రామదేవతల పండుగలకు ఏర్పాట్లు

దేవీపట్నం, ఏప్రిల్ 8: ఏటా నిర్వహించే గ్రామదేవతల పండుగలను మండలంలోని ఇందుకూరు, ఏనుగులగూడెం తదితర గ్రామాల్లో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. అమ్మవారి ఆలయాల వద్ద చలువ పందిళ్లు వేశారు. అమ్మవారికి ప్రత్యేక పూ జలు నిర్వహిస్తున్నారు.

ఘనంగా నూకాలమ్మ తీర్థం

రాజానగరం, ఏప్రిల్ 8: రాజానగరం గ్రామ దేవత శ్రీనూకాలమ్మ తీర్థం సోమవారం ఘనంగా ప్రారంభమైంది. వేకువజాము నుంచే భక్తులు అమ్మవారిని దర్శించుకుని, మొక్కులు చెల్లించుకున్నారు. గరగ నృత్యాలు, వివిధ వేషధారణలు, బాణసంచా కాల్పులతో తీర్థం కన్నుల పండువగా సాగింది. జనసేన పార్టీ మహిళా సాధికార కమిటీ కో-ఆర్డినేటర్ బత్తుల వెంకటలక్ష్మి, పలువురు ప్రముఖులు అమ్మవారిని దర్శించుకున్నారు. వారికి ఉత్సవ కమిటీ సభ్యులు ఘనస్వాగతం పలికారు. కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు, వీరమహిళలు పాల్గొన్నారు.

అరాచక పాలనకు తెరదించాలి

» సమావేశంలో ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గోరంట్ల

రాజమహేంద్రవరం రూరల్, ఏప్రిల్ 8: వైసీపీ పాలనలో వడ్రంగి, రజక తదితర పేదల బతుకులు మసకబారాయని.. అరాచక పాలనకు తెరదించాలని రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి అన్నారు.18వ డివిజన్‌లో శెట్టిబలిజ రామాలయం వద్ద ఐదుబళ్ల మార్కెట్‌కి చెందిన వడ్రంగి, రజక వెల్డింగ్ సంఘం నాయకులు నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో వడ్రంగి మేస్త్రీలకు సాన మిషన్లు, రజకులకు ఇస్త్రీ పెట్టెలను అందజేస్తే నేడు వైసీపీ ప్రభుత్వం ఆ పథకాలన్నీ రద్దుచేసిందన్నారు. మళ్లీ వారి జీవితాల్లో వెలుగులు రావాలంటే టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి అధికారంలోకి రావాలన్నారు. సమావేశంలో మాజీ కార్పొరేటర్ మానుపాటి తాతారావు, టీడీపీ మండలాధ్యక్షుడు మచ్చేటి ప్రసాద్, మార్ని వాసు దేవ్, వడ్రంగి సంఘం అధ్యక్షుడు కొలుసు రాంబాబు, చుక్క శ్రీను, బోడేపల్లి చిన్ని పాల్గొన్నారు.

టీడీపీ-జనసేన-బీజేపీ ఆత్మీయ సమావేశం

కడియం, ఏప్రిల్ 8: మండలంలోని వేమగిరిలో వేమగిరిగట్టు వద్ద టీడీపీ-జనసేన-బీజేపీ నాయకుల ఆత్మీయ సమావేశం సోమవారం నిర్వహించారు. దీనికి ఎమ్మెల్యే అభ్యర్థి గోరంట్ల బుచ్చయ్యచౌదరి విచ్చేసి ఎన్నికల్లో తనకు విజయం చేకూర్చాలని కోరారు. అలాగే వేమగిరిలో గోరంట్ల కుమార్తె కంఠమనేని శిరీష ప్రచారం నిర్వహించారు. రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి మజ్జి పద్మావతితో కలిసి ఇంటింటికీ వెళ్లి సూపర్‌సిక్స్ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో 200 మంది మహిళలు పార్టీలో చేరారు. వారికి శిరీష కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమాల్లో ఎంపీపీ వెలుగుబంటి ప్రసాద్, ముద్రగడ జమీ, గట్టి సుబ్బారావు, పాటంశెట్టి రాంజీ, వాసిరెడ్డి రాంబాబు, చెల్లుబోయిన శ్రీను, పితాని శివరామకృష్ణ, గుత్తుల కృష్ణ, కొప్పిశెట్టి రాజేష్, జంగా వినోద్ పాల్గొన్నారు.

కూటమి గెలిస్తేనే రాష్ట్రంలో సుపరిపాలన: వాసు

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 8: రాష్ట్రంలో కూటమిని అధికారంలోకి తీసుకొస్తేనే సుపరిపాలన సాధ్యమవుతుందని కూటమి రాజమహేంద్రవరం సిటీ అభ్యర్థి ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. రాజమహేంద్రవరం 44వ డివిజన్‌లో టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి కంటిపూడి శ్రీనివాస్, పాలవలస వీరభద్రం, జవ్వాది మురళీ పర్యవేక్షణలో బీజేపీ నేత దగ్గుబాటి హితేష్ చెంచురామ్‌తో కలిసి ఇంటింటికి ప్రచారం చేశారు. రాష్ట్రంలో చంద్రబాబు సీఎం కావాలన్నారు. కార్యక్రమంలో కురగంటి సతీష్, పాలవలస బ్రహ్మాజీ, వి.శంకర్ పాల్గొన్నారు.

కార్మికులకు న్యాయం చేసింది చంద్రబాబే : ఆదిరెడ్డి

మోటారు కార్మికులను, అసంఘటిత రంగ కార్మికులకు న్యాయం చేసింది చంద్రబాబేనని మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు అన్నారు. రాజమహేంద్రవరం ఆటోనగర్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆటోనగర్ రావడానికి టీడీపీ ఎంతో కృషిచేసిందన్నారు. తన కుమారుడు ఆదిరెడ్డి వాసు, ఎంపీ అభ్యర్థి దగుబాటి పురందేశ్వరిని అత్య ధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు.అనంతరం యూనియన్లు ఏర్పాటు చేసిన చలివేంద్రాలను ప్రారంభించారు. కార్యక్రమంలో మెకానికల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు పిల్లి గణేష్, గ్యాస్‌వెల్డింగ్ అండ్ బ్లాక్ స్మిత్ యూనియన్ అధ్యక్షుడు తాడి అప్పారావు, ఎలక్ట్రికల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు సన్యాసిరావు, నక్కా చిట్టిబాబు, నక్కా సన్యాసిరావు, సత్యనారాయణ, రవి, రమణ, దుబ్బిరెడ్డి చిన వెంకట్రావు, రాజు, గెద్దాడ ఆదినారాయణ పాల్గొన్నారు.



గోకవరం సమావేశంలో మాట్లాడుతున్న జ్యోతుల నెహ్రూ

అన్నిపార్టీలు సమన్వయంతో పనిచేయాలి : నెహ్రూ

గోకవరం, ఏప్రిల్ 8: రాష్ట్రంలో అరాచక పాలనకు తెరదించడానికి టీడీపీ-జనసేన-బీజేపీ ఉమ్మడి అజెండాతో ముందుకు వెళ్తోందని, ఇందుకోసం అన్ని పార్టీల నాయకులు సమన్వయంతో పని చేయాలని నియోజకవర్గ అభ్యర్థి జ్యోతుల నెహ్రూ అన్నారు. గోకవరం గ్రామ శివారున గోపీకృష్ణ ఫంక్షన్ హాల్‌లో సోమవారం నిర్వహించిన కూటమి విస్తృతస్థాయి సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రసంగించారు. ఐక్య నిర్ణయాలతో కూటమి అభ్యర్థుల విజయానికి కృషి చేయాలన్నారు. రాష్ట్రాన్ని అడ్డుగోలుగా దోచుకున్న సీఎం జగన్మోహన్‌రెడ్డి కంబంధహస్తాల నుంచి రాష్ట్రాన్ని రక్షించేందుకు కలిసి ముందుకు వెళ్తున్నామన్నారు. ఈనెల 15నుంచి 11 రోజుల పాటు మండలంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తామని, కార్యక్రమంలో మూడు పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. సమావేశంలో టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం పలు గ్రామాల వైసీపీ నాయకులు టీడీపీలో చేరారు.

టీడీపీలోకి బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు..

మండలంలోని గుమ్మళ్లదొడ్డి సచివాలయ కన్వీనర్, బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు, పీఎంపీ అసోసియేషన్ జిల్లా కోశాధికారి పెంటిమేని చిన్ని ఆధ్వర్యంలో సుమారు 200 మంది వైసీపీ కార్యకర్తలు సోమవారం టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వారందరికీ జ్యోతుల నెహ్రూ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సభలో నెహ్రూ మాట్లాడుతూ గత ఎన్నికల సమయంలో మాయమాటలు చెప్పి మోసం చేసిన వైసీపీ ప్రభుత్వానికి రానున్న ఎన్నికల్లో ఓటుతో గుణపాఠం చెప్పాలన్నారు. టీడీపీలో చేరినవారిలో సూరంపూడి నాగు, పితాని శివ, సూరంపూడి అయ్యన్న, వార్డు మెంబర్లు సూరంపూడి శ్రీను, దమ్ము రామయ్య, తదితరులున్నారు.

వ్యాసరచన, పద్యపోటీలు

దివాన్‌చెరువు, ఏప్రిల్ 8: దివాన్‌చెరువులోని శ్రీ మహా గణపతి యువజన సేవాసమితి ఆధ్వర్యంలో ఉగాది సందర్భంగా సోమవారం వ్యాసరచన, పద్యపోటీలు జరిగాయి.

సాగులో ఆధునిక పరిజ్ఞానంతో అధిక దిగుబడులు

» ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం ఏడీ శ్రీనివాస్

దివాన్‌చెరువు, ఏప్రిల్ 8: వ్యవసాయ పంటల్లో నాణ్యమైన, స్థిరమైన దిగుబడులు ఆధునిక పరిజ్ఞానంతోనే సాధ్యమని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం సహ సంచాలకుడు ధన్వంరాజు శ్రీనివాస్ అన్నారు. స్థానిక ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ చల్లా వెంకట నరసింహారావుతో కలసి ఆయన శ్రీకృష్ణప ట్నంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే సార్వాలో రైతులు అభిమతం ప్రకారం రూపొందించిన నూతన రకాలైన ఎంటీయూ 1271, బీపీటీ 2846, ఎస్ఎల్ఆర్ 3238 వంటి రకాలను రైతుల కమతాల్లో ఏరు వాక కేంద్రం శాస్త్రవేత్తలు పరీక్షిస్తారన్నారు. కోతులు, ఎలుకల నుంచి పంట రక్షణకు సోలార్ కంచె, ఎరతెర పద్ధతులను పరీక్షించారు. నరసింహారావు మాట్లాడుతూ జిల్లాలో రాజానగరం, కోరుకొండ, నల్లజర్ల, కొవ్వూరు, అనపర్తి వంటి వరి పండించే ప్రాంతాలకు సహ సంచాలకుల ప్రోత్సాహంతో మినీకిట్స్ అందజేస్తామన్నారు. తాము, మార్టేరు ఏడీఆర్ శ్రీనివాస్ కోరుకొండ మండలం లోని దోసకాయలపల్లి, శ్రీరంగపట్నం, కోటికేశవరం గ్రామాల్లో కూడా పర్యటిం చామన్నారు. ఈ సందర్భంగా ఏడీఆర్ రైతు కమతాల్లో ప్రయోగాలను సంద ర్శించి వారి అభిప్రాయాలను, వారికి కావలసిన సాంకేతిక వనరులను అడిగి తెలుసుకున్నారని చెప్పారు. కార్యక్రమంలో ఏరువాక ప్రధాన శాస్త్రవేత్తలు పి.అమ్మాజీ ఎస్.హైమజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

బీసీ వర్గాలపై వైసీపీ వరుస దాడులు

కడియం, ఏప్రిల్ 8: బీసీ వర్గాలపై వైసీపీ వరుస దాడులకు పాల్పడుతోందని టీడీపీ బీసీసెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాసరావు ఆరోపించారు. వేమగిరిలో సోమవారం ఆయన మాట్లాడుతూ బీసీలను పొగడుతూ మరో వైపు వైసీపీ మూకలు బీసీ వర్గాలపై దాడి చేయడం నోటితో పొగిడి నొసటితో వెక్కిరించినట్లు ఉందన్నారు. జగన్ బీసీలపై కపట ప్రేమను కురిపిస్తున్నారన్నారు. పెండ్లిమర్రులో జగన్ మేనమామ రవీంద్రనాథ్‌రెడ్డి అనుచరులు శ్రీనివాసులు అనే బీసీ యువకున్ని హత్యచేసి 24 గంటలు గడవక మందే నంది కొట్కూరులో బైరెడ్డి సిద్ధార్థరెడ్డి అనుచరుడు శ్రీనివాసరెడ్డి ఓ ముస్లిం మహిళ పట్ల అవమానకరంగా ప్రవర్తించారని మండిపడ్డారు.

సంస్కృతిని భావితరాలకు అందించాలి

దివాన్‌చెరువు, ఏప్రిల్ 8: మన ఆచార సాంప్రదాయాలు ఎంతో గొప్ప వని, వాటిని భావితరాలకు అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందని ప్రిన్సిపాల్ జి.రవికాంత్ అన్నారు. పాలచర్లలోని బీవీసీ ఇంజనీరింగ్ కళాశాలలో చైర్మన్ బోణం కృష్ణసతీష్ ఆధ్వర్యంలో ఉగాది సంబరాలను సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు సాంప్రదాయ దుస్తులు ధరిం చారు. ఉగాది పచ్చడి తయారు చేసి అందరికీ పంచారు. అనంతరం సాం స్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. కార్యక్రమంలో కళాశాల గవర్నింగ్ బాడీ సభ్యులు బోనం కనకదుర్గ, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

కడియంలో చలివేంద్రం ఏర్పాటు

కడియం, ఏప్రిల్ 8: కడియం దేవీ సెంటర్‌లో చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. జనసేన పార్టీ నాయకుడు మర్రి శంకర్ మిత్రబృందం ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎంపీపీ వెలుగుబంటి ప్రసాద్ సోమవారం ప్రారంభించారు. శంకర్ 12 ఏళ్లుగా తన మిత్రులతో కలిసి వేసవిలో చలివేంద్రం నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో జనసేన, టీడీపీ మండ లాధ్యక్షులు ముద్రగడ జమీ, వెలుగుబంటి నాని, పాటంశెట్టి రాంజీ, చిలుకూరి నాగేశ్వరరావు, కళ్యాణ సూరి బాబు, తమ్మిశెట్టి ప్రసాద్, గ్రీన్‌లాండ్ బాబి, మర్రి సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

గైట్ అటానమస్ కళాశాలకు నాక్ ఏ++ గ్రేడ్

రాజానగరం, ఏప్రిల్ 8: గైట్ అటానమస్ కళాశాల 3వ కాన్సిక్యూటివ్ సైకిల్‌లో నేషనల్ అసెస్మెంట్ అండ్ అక్రిడేషన్ కౌన్సిల్(నాక్) ఏ++ గ్రేడ్ గుర్తింపు సాధించినట్టు మేనేజింగ్ డైరెక్టర్ కె.శశికిరణ్ వర్మ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. నాక్ పీర్ టీం గత నెల 27,28 తేదీల్లో గైట్ కళాశాలను సందర్శించి, రెండు రోజుల పాటు కళాశాలలోని బోధన, మౌలిక వసతులను పరిశీలించిన అనంతరం ఏ++ గ్రేడ్ సాధించినట్టు చెప్పారన్నారు. కళాశాల అధ్యాపకులు, సిబ్బంది సమిష్టి కృషితో ఏ++ గ్రేడ్ సాధించినట్టు శశికిరణ్‌వర్మ పేర్కొన్నారు.

రెండు వాయిదాల పన్ను ఒకేసారి కడితే రాయితీ

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 8: రాష్ట్ర ప్రభుత్వం 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఇంటి,ఖాళీ స్థలాల పన్నులు రెండు వాయిదాలు కలిపి ఏకమొత్తంలో ఈనెల 30వ తేదిలోగా కడితే వారికి 5 శాతం రాయితీని కల్పించినట్టు రాజమహేంద్రవరం కమిషనర్ దినేష్ కుమార్ తెలిపారు. పన్ను చెల్లింపుదారులు చెక్కు, డీడీల ద్వారా గాని, డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.సీడీఎమ్ఎ.ఏపీజీవో వీ.ఇన్ వెబ్‌సైట్‌లోగాని చెల్లింపులు చేయవచ్చని తెలిపారు. ఈ అవకాశాన్ని పన్ను చెల్లింపుదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ మేరకు అదనపు కౌంటర్లు ఏర్పాటు చేశామన్నారు.

కృష్ణ బలిజ (బుక్కా) సంక్షేమ సంఘం కార్యవర్గం

రాజమహేంద్రవరం కల్చరల్ ఏప్రిల్ 8: మోచీవీధి బెజవాడ రంగారావు ఆఫీసులో తూర్పుగోదావరి జిల్లా కృష్ణ బలిజ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గాన్ని సోమవారం ఎన్నుకున్నారు. సంఘ సలహా సభ్యులైన డా.పిల్లాడి పరమహంస,బెజవాడ రంగారావు ఆధ్వర్యంలో నూతన కమిటీని ప్రకటించారు.అధ్యక్షుడిగా తాడి సూరిబాబు, ఉపాధ్యక్షుడిగా బెజవాడ వెంకట స్వామి, ప్రధాన కార్యదర్శిగా అరవ శ్రీధర్, కార్యదర్శిగా పిల్లాడి రుద్రయ్య, కోశాధి కారిగా పిల్లాడి వెంకన్న పలువురు సభ్యులను ఎన్నుకున్నారు.

ఘంటాలమ్మ వసంత మహోత్సవం

రాజమహేంద్రవరం కల్చరల్ ఏప్రిల్ 8: ఘంటాలమ్మ వసంతోత్సవం సందర్భంగా పురోహితులు కాల్దరి నాగమల్లేశ్వర శర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక కుంకుమ పూజలు చేశారు. అమ్మవారి ఆలయం నుంచి మంగళవారంసాయంత్రం ఊరేగింపు ఉంటుందని ఆలయ కమిటీ తెలిపింది.

వృద్ధులకు ఉచిత వైద్య శిబిరం

రాజమహేంద్రవరం, ఏప్రిల్(ఆంధ్రజ్యోతి): జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, వైద్యశాఖ సంయుక్తంగా గౌతమి జీవకారుణ్య సంఘం వృద్ధాశ్రమంలో సోమ వారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. డీఎల్ఎస్ఏ కార్యదర్శి సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రత్యూషకుమారి వృద్ధులతో మాట్లాడి యోగక్షేమాలపై ఆరా తీశారు. సమయానికి ఆహారం తీసుకుంటూ క్రమం తప్పకుండా మందులు వేసుకోవాలన్నారు. వేసవిలో మంచినీరు ఎక్కువగా తాగాలన్నారు. వైద్య శిబిరంలో వృద్ధులకు పరీక్షలు చేసి మందులు అందజేశారు. కార్యక్రమంలో ప్యానల్ అడ్వకేట్ జి.దేవి భవాని, పారా లీగల్ వలంటీర్లు వై.వెంకటేశ్వరరావు, మెడికల్ ఆఫీసర్ డా.సంధ్య, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



గుర్తుతెలియని వృద్ధుడి మృతి

రాజమహేంద్రవరం, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): కడియం రైల్వే స్టేషన్ సమీపంలో సుమారు 60 ఏళ్ల గుర్తు తెలియని వృద్ధుడు మరణించాడు. రైల్వే ట్రాక్ దాటుతూ రైలు ఢీకొట్టడంతో మరణించాడని ప్రభుత్వ రైల్వే పోలీసులు తెలిపారు. వివరాలు తెలిసిన వారు 94910 03239కి సమాచారం అందించాలని కోరారు.

రైళ్లలో జీఆర్పీ తనిఖీలు

రాజమహేంద్రవరం, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): ఎన్నికల నేపథ్యంలో రైళ్లలో ప్రభుత్వ రైల్వే పోలీసులు తనిఖీలు చేపట్టారు. డీఎస్ఆర్పీ ఎల్.మోహనరావు పర్యవేక్షణలో సీఐ విజయ్‌శంకర్, ఎస్ఐలు పి.లోవరాజు, ఎం.మావుళ్లు, బి.ర వికుమార్ తమ సిబ్బందితో నాలుగు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి రాజమండ్రి నుంచి ఇటు తాడేపల్లిగూడెం, అటు సామర్లకోట వరకూ రైళ్లలో ప్రయాణికుల లగేజీలు పరిశీలించారు.అనుమానాస్పద వ్యక్తులను ప్రశ్నించారు.

సంక్షేమం మాటున సంక్షోభం

ఎన్‌జేపీ రాష్ట్ర అధ్యక్షుడు కడియం

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 8: రాష్ట్రంలో సీఎం జగన్ సంక్షేమం మాటున సంక్షోభం సృష్టించాడని నేషనలిస్టు జనశక్తి పార్టీ (ఎన్‌జేపీ) రాష్ట్ర అధ్యక్షుడు కడియం సూరిబాబు అన్నారు. రాజమండ్రి ప్రెస్‌క్లబ్‌లో సోమవారం విలేకరులతో మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. ఎన్నికలకు 18 అంశాలతో రూపొందించిన మేనిఫెస్టోను ఆవిష్కరించారు. ఈ సార్వత్రిక ఎన్నికల్లో తాము పోటీ చేస్తున్నామన్నారు. జిల్లా అధ్యక్షుడిగా పట్నాల మురళీకృష్ణ, అనకాపల్లి జిల్లా అధ్యక్షుడిగా కొమ్మోజు రమేష్‌లను నియమించినట్టు చెప్పారు. సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పట్నాల సాయికుమార్, అధికార ప్రతినిధి పి.శ్రీనివాసాచారి , సభ్యులు చిట్టూరి సత్యనారాయణ, మాధవ్ తదితరులు పాల్గొన్నారు.

18న బీజేపీలోకి శ్రీనివాసరావు


గోకవరం, ఏప్రిల్ 8: విశ్వ హిందూ ధర్మ పరిరక్షణ రామసేన వ్యవస్థాపక అధ్యక్షుడు కంబాల శ్రీనివాసరావు ఈనెల 18న బీజేపీలోకి చేరనున్నారు. గోకవరంలోని సీఎండీకే ఎస్‌పీవీ పిన్స్‌లే అవుట్‌లో సోమవారం జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన ఈ విషయాన్ని ప్రకటించారు. తాను బీజేపీలో చేరేందుకు రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరిని కలిసినట్టు చెప్పారు.

రెండు సామాజిక వర్గాల ఘర్షణ ఆరుగురిపై అట్రాసిటీ కేసు

కడియం, ఏప్రిల్ 8: కడియపుసావరంలో ఈ నెల 6వ తేదీ రాత్రి అమ్మవారి జాతర సందర్భంగా ఇరువర్గాల మధ్య జరిగిన ఘర్షణ చినికి చినికి గాలివానలా మారింది. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఈనెల 6న జరిగిన మహాలక్ష్మమ్మ జాతరలో రెండు సామాజిక వర్గాల యువకుల మధ్య ఘర్షణ జరిగింది. గాజుసీసాలతో దాడులకు దిగారు. ఈ ఘటనలో ఐదుగురు దళిత యువకులు గాయపడడంతో వారిని ఆసుపత్రికి తరలించారు. క్షతగాత్రుడు రేగుళ్ల కార్తీక్ ఫిర్యాదు మేరకు ఆరుగురిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్టు సీఐ బి.తులసీధర్ తెలిపారు. ఈ ఘటనపై డీఎస్పీ ఎం.అంబికా ప్రసాద్ దర్యాప్తు చేస్తున్నారు. రాజమహేంద్రవరంలో వైద్యం పొందుతున్న యువకుణ్ని విచారించారు. సీసీ పుటేజ్ పరిశీలిస్తామన్నారు.

నిందితులపై చర్యలు తీసుకోవాలి..

కడియపుసావరం గ్రామాన్ని బీఎస్పీ నాయకులు పట్నాల విజయకుమార్, రిపబ్లికన్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నక్కా వెంకటరత్నం రాజు, దళిత నాయకులు జిత్తుగ రాజేష్, జువ్వల రాంబాబు తదితరులు సావరంలో పర్యటించారు. అనంతరం సీఐ తులసీధర్‌తో మాట్లాడారు. బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలని నిందితులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



రంజాన్ వేళలు
ఇఫ్తార్(మంగళ) సా. 6.26
సహర్(బుధ) ఉ. 4.38

ఎండా కాలమ్

	గరిష్ఠం	కనిష్ఠం
రాజమండ్రి	40.0	25.0



చంద్రబాబు, పవన్‌ల ఉమ్మడి సభకు స్థలాన్ని పరిశీలిస్తున్న శేషారావు

రేపు నిడదవోలులో చంద్రబాబు, పవన్ రోడ్ షో

నిడదవోలు, ఏప్రిల్ 8 : జిల్లాలో తొలిసారిగా నిడదవోలు పట్టణంలో బుధవారం టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు, జనసేన అధినేత పవన్‌కల్యాణ్ ఉమ్మడిగా రోడ్‌షో,బహిరంగ సభ నిర్వహించనున్నారు. ఈ మేరకు సోమవారం టీడీపీ నిడదవోలు ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు, టీడీపీ శ్రేణులు నిడదవోలు బ్రాహ్మణగూడెం రోడ్డులో ప్రాంతాన్ని సభావేదికకు, హెలిపాడ్‌ను పరిశీలించారు. సార్వత్రిక ఎన్నికల ప్రచారానికి రోడ్‌షోకు ఇద్దరు అధినాయకులు చంద్రబాబు, పవన్ రానున్న నేపథ్యంలో నిడదవోలు టీడీపీ,జనసేన పార్టీలో జోష్ పెరిగింది. ఉమ్మడి రోడ్‌షో, బహిరంగ సభను విజయవంతం చేయాలని బూరుగుపల్లి శేషారావు, ఉమ్మడి అభ్యర్థి కందుల దుర్గేష్ పిలుపునిచ్చారు.

వీఆర్‌కు నిడదవోలు సీఐ

- వైసీపీ నాయకుల ఆదేశంతో బెదిరింపు
- ఎన్నికల కమిషన్‌ను ఆశ్రయించిన జనసేన కార్యకర్త
- విచారించి వీఆర్‌కు పంపుతూ ఆదివారం ఆదేశాలు



నిడదవోలు, ఏప్రిల్ 8 : సార్వత్రిక ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘించడంతో ఒక సీఐ ఎన్నికల కమిషన్ ఆదేశాలతో వీఆర్‌లోకి వెళ్లారు. నిడదవోలులో ఇటీవల ఓ వైసీపీ మహిళానేతకు సమీప బంధువైన ఓ యువకుడు తన మిత్రులతో కలిసి జనసేన పార్టీలో చేరారు. దీంతో వైసీపీ మహిళా నేత జనసేన పార్టీ కార్యకర్తలపై కక్ష కట్టి తనకు ఉన్న పరిచయంతో సీఐ కె.వెంకటేశ్వరరావు ద్వారా జనసేన పార్టీకి చెందిన కార్యకర్త జి. రాజేష్‌ను పోలీస్ సర్కిల్ కార్యాలయానికి పిలిచి రెండు గంటల పాటు ఉంచి వైసీపీకి చెందిన వ్యక్తులెవరినైనా సభ్యత్వంగా తీసుకుంటే మర్యాదగా ఉండదని గట్టి వార్నింగ్ వంటి కౌన్సెలింగ్ ఇచ్చినట్టు రాజేష్ తెలిపారు. దీం తో జనసేన కార్యకర్తలు ఎన్నికల కమిషన్‌కు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. దీనిపై పోలీసు ఉన్నతాధికారులు విచారించి సీఐ కె.వేంకటేశ్వరరావును వీఆర్‌కు పంపుతూ ఆదివారం ఆదేశాలు జారీ చేశారు. సీఐ ఆదివారం అందుబాటులో లేకపోవడంతో సోమవారం ఈ ఉత్తర్వులను సీఐకు అందజేశారు.ఇదిలా ఉండగా నిడదవోలుకు కొవ్వూరు రూరల్ సీఐను ఇన్‌చార్జిగా నియమించారు. వైసీపీకి చెందిన ఆమె వ్యవహారం కారణంగానే సీఐ వెంకటేశ్వరావు వీఆర్‌కు బదిలీ అయ్యారని ఇప్పటికే ఆమె వల్ల పార్టీకి ఎంతో నష్టం జరిగిందని ఇలాంటి సంఘటనలు ఎన్నికల సమయంలో పార్టీకి మరింత నష్టం వాటిల్లుతుందంటూ సొంత పార్టీ నేతలే వాపోతున్నారు. నిడదవోలు సీఐ కార్యాలయంలో ఇద్దరు సీఐలు వీఆర్‌కు వెళ్లడం వెనుక ఆమె కారణమని సమాచారం.

ఆదేశాలు నిజమే.. రామారావు, డీఎస్పీ

నిడదవోలు సీఐ వెంకటేశ్వరరావుపై జనసేన పార్టీ కార్యకర్తలు ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ అనంతరం జిల్లా పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సీఐ ను వీఆర్‌కు పంపుతూ ఆదేశాలు జారీ చేశారు.

సీఐ వేధించారు.. రాజేష్, జనసేన

నిడదవోలు సీఐ పిలిపించి వైసీపీ కుటుంబానికి చెందిన ఓ వ్యక్తిని నీ వెందుకు జనసేనలో జాయిన్ చేశావంటూ వేధించారు. దీనిపై ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశాను. విచారించి వీఆర్‌లోకి పంపారు.



(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

"శతాయుర్వజ్ర దేహాయ సర్వ సంపత్కరాయచ! సర్వారిష్ట వినాశాయ నింబ కందళ భక్షణం!!" అనే శ్లోకాన్ని పఠిస్తూ ఉగాది రోజున షడ్రుచుల సమ్మేళన పచ్చడిని సేవిస్తారు.ఈ పచ్చడి వాత, పిత్త, పైత్య, వికార దోషాలను తొలగించి ఆరోగ్యం కలిస్తుందని వైద్య శాస్త్రం చెబుతుంది. అయితే జీవన సందేశాన్నిచ్చే మరో సత్యం కూడా ఈ శ్లోకంలో నిగూఢంగా ఇమిడి ఉంది. అదే.. ఆశావహ దృక్పథంతో 'మంచి' అందుకోవాలని.. జీవన గమనం 'తీపి'గా సాగాలని బోధిస్తుంది.యుగాదిగా పేరుగాంచి.. కాలక్రమేణ 'ఉగాది'గా తెలుగు వారింట తొలి పండుగగా స్థిరపడింది. ఈ సారి ఉగాదిని తీపిమయం చేసుకోవడం ఓటరు చేతిలోనే ఉంది. గత నాలుగున్నరేళ్లగా దగా పాలకుల వల్ల పరిస్థితులు చేదెక్కాయి.వైసీపీ అరాచక పాలనతో ఏ వర్గం కూడా సంతోషంగా లేదు. రోడ్డెక్కని ఉద్యోగి లేడు.. సమ్మె చేయని శ్రామికుడూ లేడు. అందుకే ఓటర్లు కూడా చేదు పోవాలి.. తీపి కావాలని కోరుకుంటున్నారు.

ఐదేళ్లుగా చేదుగా మారిన బతుకులు..

తెలుగు సంవత్సరంలో తొలి పండుగ ఉగాది. ఐదేళ్లుగా చేదుమయంగా మారిన జీవితాలను తీపిగా చేసుకోవడానికి ఈ ఉగాదితో ఓటర్లు నాంది పలకడానికి 'సిద్ధం'గా ఉన్నారు. వైసీపీ ప్రభుత్వం వచ్చాక ఉద్యోగస్తులకు సరిగా జీతాలందిన దాఖలాలు లేవు. సుమారు 40 ప్రభుత్వ శాఖలు ఉండగా పోలీస్ మినహా ఏ ఒక్క శాఖకూ ఒకటో తేదీన జీతం చేతిలో పడింది లేదు. పండుగ ఏదైనా అప్పులకు చేతులు చాపక తప్పలేదు. గతంలో ఎన్నడూ లేని విధంగా వేతనాలు క్రమం తప్పాయి. ఆర్థిక క్రమశిక్షణ గాడి తప్పడంతో జీతాలు భారంగా మారాయి. ఉపాధ్యాయులు మరీ చేదును దిగమింగారు. ఒకటో తేదీన జీతాలందక విలవిల్లాడిపోయారు.ఎన్నడూ లేనిది చివరకు ఒకటో తేదీన జీతాలు ఇవ్వండి మహాప్రభో అంటూ ధర్నాలు చేయడం గమనార్హం. శ్రామికులకు చేతిలో పని లేకుండాపోయింది. ప్రభుత్వం బిల్లులు చెల్లించకపోవడంతో అభివృద్ధి పనులూ అటకెక్కాయి. ఇలా వైసీపీ ప్రభుత్వ పాలనలో తీపి కరువై చేదుగా మారింది. లక్షల్లో ఉద్యోగాలంటూ గత ఎన్నికల్లో ఊదరగొట్టిన జగన్ తీరా అధికారంలోకి వచ్చాక వలంటీర్లని సొంత రాజకీయ సైన్యం తయారు చేసుకునే పని ప్రారంభించారు. దానికి 'సేవ' అని పేరు తగిలించారు.నాలుగున్నరేళ్ల ఊడిగం చేయించుకున్నారు. చివరికి ఎన్నికల వేళ తొలగించారు. ఇప్పుడు తమ సొంత సైన్యంలా చేసుకునేందుకు రాజీనామాలు చేయిస్తున్నారు.జగన్ మాటలతో దగా పడిన ఆశాలు, అంగన్వాడీలు, సమగ్ర శిక్షా ఉద్యోగులు, మధ్యాహ్న భోజన పథక కార్మికులను ఇబ్బంది పెట్టారు. ఎన్నో సార్లు నిరసన తెలిపినా ఆశాలు..అంగన్‌వాడీల వేదన జగన్ ప్రభుత్వానికి వినబడలేదు. సుమారు రెండు నెలల పాటు సమ్మెలో నలిగిపోయారు. అయినా లాభం లేదు.. జూన్ తరువాత చూద్దాం అంటూ సరిపెట్టారు. జూన్ తరువాత ఈయన చూసేదేమిటనేది ఆయా వర్గాల వాదన. 'సమగ్ర శిక్ష' సిబ్బంది బతుకులు ఇబ్బందులతో మరీ చేదుగా మారడంతో పెన్‌డౌన్ చేశారు. కేంద్రం తన వాటా నిధులను విడుదల చేస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం వాటిని దారి మళ్లిస్తుండడం ద్వారా సమస్యకు తెరలేపింది.పసిపిల్లలకు బుద్ధులు నేర్పుతున్న అంగన్వాడీ వర్కర్లు ప్రభుత్వానికి మాత్రం సుద్దులు నేర్పడానికి నానా తంటాలూ పడ్డారు. ఎన్నోసార్లు ప్రభుత్వానికి విన్నవించి చివరికి సమ్మెకు దిగారు. అయితే వీరిపై ప్రభుత్వం దాష్టీకానికి ఒడిగట్టింది. సెంటర్ల తాళాలను ప్రభుత్వ యంత్రాంగంతోనే బద్ధలు కొట్టించి భయబ్రాంతులకు గురిచేసింది. ప్రజాస్వామ్య చరిత్రలో ఒక ప్రభుత్వం ఉద్యోగులపై ఇంత చేదుగా ప్రవర్తించడం ఇదే తొలిసారి కావొచ్చు. ఉద్యోగాలు తీసేస్తామని బెదిరించారు. వారి డిమాండ్లకు నేటికీ అతీగతీ లేదు. సచివాలయ సిబ్బందికీ ఇబ్బందులు తప్పలేదు. ఎన్నికల నోటిఫికేషన్‌కి రోజులు దగ్గర పడుతున్న వేళ సచివాలయ సిబ్బంది సర్దుబాటును ప్రభుత్వం తెరపైకి తెచ్చింది. ఇప్పటికే సచివాలయ సిబ్బందిని 'అన్ని' పనులకూ వాడేస్తున్నారు. వైసీపీ సమావేశాలకు జనాలను తరలించడం.. చివరికి ఆడుదాం ఆంధ్రా ఆటలకు వీక్షకులను తీసుకొచ్చే పనిని సచివాలయ సిబ్బందికే అప్పగించారు. జగన్ సభలకైతే చెప్పనవసరం లేదు. ఆడుదాం ఆంధ్రా ఆటలను చూడడానికి జనాలను తీసుకురాకపోతే సస్పెండ్ చేస్తామంటూ ఏకంగా ఓ ఐఏఎస్ అధికారి ఆ చిరుద్యోగులపై బెదిరింపులకూ దిగారు. జాబ్ చార్టు ప్రకారం నిర్వర్తించాల్సిన విధుల కంటే అదనపు భారం ఉందని సచివాలయ సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్న తరుణంలో రేషనలైజేషన్ (సర్దుబాటు) అంటూ వాళ్లను మరింత ఆవేదనలోకి పాలకులు నెట్టేశారు. సచివాలయాల్లో 8-11 మంది ఉంటారని పాలకులు అధికారంలోకి వచ్చిన తొలినాళ్లలో చెప్పారు. ఇప్పుడు కొన్నింటిలో ఐదుగురే నెట్టుకొస్తున్నారు. పింఛను లబ్ధిదారులనూ వైసీపీ వంచన చేసింది.జిల్లాలో 32,597 మందికి పింఛను అందుతుండగా ఆ సంఖ్యను 32,442కి పరిమితం చేసి 1,022 కొత్తవి ఇచ్చినట్టు చూపించారు. దివ్యాంగులకు ఉండే ప్రత్యేక పరిస్థితుల వల్ల వాళ్లకు కాస్త ఎక్కువ మొత్తంలో పింఛను ఇచ్చేవారు. సాధారణ కేటగిరీలకు రూ.2వేలు ఇచ్చినా వారికి రూ.3వేలు ఇచ్చేవారు.

ఈ సారి తీపి రావాలని..

ఈసారి కచ్చితంగా మంచి గెలవాలి. తీపి రావాలని ప్రతి ఓటరూ ఎదురు చూస్తున్నాడు. గతంలో ఎన్నడూ లేని విధంగా నాలుగున్నరేళ్లగా చేదును దిగమింగుతూ వస్తున్న జనం ఓటు వేసే రోజు కోసం ఎదురు చూస్తున్నారు.గత టీడీపీ ప్రభుత్వంలో ఉద్యోగులు ఇబ్బంది పడింది లేదు. ఒకవేళ సమస్య ఎక్కువైతే పాలకులు సర్దిచెప్పి వారి డిమాండ్లను నెరవేర్చడానికి ప్రయత్నించేవారు.ఇసుకను ఉచితంగా సరఫరా చేశారు. భవన నిర్మాణ సామగ్రి అందుబాటు ధరల్లో దొరకడంతో భవన నిర్మాణ కార్మికులకు చేతినిండా పని ఉండేది. ఆశాలు, అంగన్వాడీలు సమగ్ర శిక్షా వంటి ఉద్యోగులు దగా పడింది లేదు. వాస్తవానికి డ్వాక్రాలను టీడీపీ హయాంలోనే ప్రారంభించారు. సంఘటితంగా పొదుపు చేసుకున్న సంఘాలకు ప్రభుత్వం చేయూతను ఇచ్చి ఆర్థికంగా స్వావలంబన సాధించే దిశగా నడిపించేది. ఈసారి జనసేన, బీజేపీతో టీడీపీ పొత్తు కట్టింది. ప్రజా ప్రయోజనాలకు మూడు పార్టీలూ కలిసి అడుగులు వేస్తు న్నాయి. అభ్యర్థుల ఎంపికలోనూ ఆచితూచి వ్యవహరించారు. ప్రజా నిర్ణయమే శిరోధార్యంగా గెలుపు గుర్రాలను సిద్ధం చేశారు. దీంతో తీపి కబురు ఓటరు చేతిలోనే ఉందనే చర్చ నడుస్తోంది. టీడీపీ, జనసేన సూపర్ సిక్స్ ప్రకటించడంతో జోష్ జోరందుకొంది. ఈ నాలుగున్నరేళ్లలో దగా పడిన ప్రజా జీవనాన్ని మళ్లీ ప్రగతి పట్టాలెక్కించే దిశగా టీడీపీ, జనసేన, బీజేపీ కలిసి ముందుకు సాగుతున్నాయి. అవి తీపిని వాకిట్లోకి తీసు కొచ్చేందుకు శ్రమించినా ఆ మంచిని అందుకొనే నిర్ణయం ఓటరు చేతిలోనే ఉందనేది నిర్వివాదాంశం.

కానీ ఇప్పుడు రూ.3 వేలు తీసుకునే వాళ్లతో వీరి పింఛను సమానమైపోయింది. చివరికి దివ్యాంగులనూ వంచన చేశారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన రోజు నుంచే విధ్వంసానికి తెరతీసింది.టీడీపీ హయాంలో నిర్మించిన ప్రజా వేదికను నేలమట్టం చేయడంతో పాలన మొదలు పెట్టారు. దళితులపై దాష్టీకాలకు అంతులేదు.నా ఎస్సీలంటూనే దారుణాలు చేశారు. సీతానగరంలో ప్రసాద్ అనే యువకుడికి శిరోముండనం చేశారు. నల్లజర్ల పోలీస్ స్టేషన్ పరిధిలో రాజకీయ పందేరంలో ఒక యువకుడు ప్రాణాలు తీసుకున్నాడు. కరోనా సమయంలో మాస్కులు అడిగిన పాపానికి విశాఖలోని ఓ మంచి వైద్యుడిని పిచ్చివాడిగా చిత్రీకరించి వైసీపీ చంపేసింది. ఆ పార్టీ ఎమ్మెల్సీ అనంతబాబు చేసిన దారుణంపై దళితులు ఇప్పటికీ రగులుతూనే ఉన్నారు. దళితుడైన తన డ్రైవరును తీవ్రంగా చిత్రహింసలు పెట్టి చంపేసి మృతదేహాన్ని ఏకంగా కారులో ఇంటికి తీసుకెళ్లి పడేశాడు. ఇలా ప్రతీ వర్గం వైసీపీ చేతిలో దగా పడింది. ఇసుక, మట్టి వంటి వనరులను అక్రమంగా మింగేశారు. జిల్లాలోని పోలీసులతో కూడా వైసీపీ ఆడుకొంది.చోటామోటా కార్యకర్తలకు పోలీసులు భయపడాల్సిన పరిస్థితి తెచ్చింది. తమ 'మాట' విననివాళ్లపై కక్ష సాధించింది. టీడీపీ నాయకులపై అక్రమంగా కేసులు బనాయించలేదని ఒక సీఐని అన్యాయంగా వీఆర్‌లోకి పంపింది. సెంట్రల్ జైలు సూపరింటెండెంట్, దళిత ఉద్యోగి రాజారావును ఆకస్మాత్తుగా బదిలీ చేసింది.టీడీపీ నేతలు జైలులో ఉన్నప్పుడు పరామర్శించడానికి వచ్చిన చంద్రబాబుకు ములాఖత్ ఇవ్వడమే ఆ ఉద్యోగి చేసిన తప్పు.ఇలా ఉద్యోగులు కిక్కురుమనడానికీ ఉలిక్కిపడే పరిస్థితులు తెచ్చింది.జీతాల్లేవు,టీఏ, డీఏ బిల్లులు రావు, తీవ్రమైన పనిఒత్తిడి, దారుణమైన రాజకీయ ప్రమేయం.. ఇలా ఈ ప్రభుత్వంలో ఉద్యోగులకు ఉద్యోగం చేదుగా మారింది. ప్రాణాలను మింగేస్తున్నా రోడ్లను మాత్రం బాగు చేయ లేదు.వైసీపీ ప్రభుత్వంలో నాలుగున్నరేళ్లలో ప్రభుత్వ ఉద్యోగాలకు ఒక్క నోటిఫికేషనూ రాలేదు.చివరిలో జనాల ను మభ్యపెట్టడానికి మెగా డీఎస్సీ అని దగా చేశారు. అప్పులు చేసి చేపలు చేతికిస్తూ ప్రభుత్వం పబ్బం గడుపుకొంది.

- వైసీపీ పాలనలో అన్ని వర్గాలకు ఇబ్బందే
- ఉద్యోగులకు ఒకటో తేదీన జీతాల్లేవ్
- కాంట్రాక్టు కార్మికులకు హామీల అమల్లేవ్
- ధర్నాలు చేసినా పట్టించుకోని వైనం
- పింఛనుదారులకు వంచన
- దివ్యాంగులకు మొండిచేయి
- పెరిగిన అరాచకాలు
- ఇక చాలంటున్న ఓటర్లు
- ఉగాది వేళ కూటమి వైపు చూపు



నేడు ఉగాది

నవ వసంతంలోకి అడుగుపెట్టబోతున్నాం..
తీపి.. చేదు కలిసిందే జీవితం..
కష్టం.. సుఖం తెలిసిందే జీవితం..
చేదు పోవాలి.. తీపి రావాలి..

నేడు (మంగళవారం) క్రోధినామ సంవత్సర ఉగాది సందర్భంగా ఇదే ప్రతి ఒక్కరి ఆశ .. తెలుగు ఏడాదిలోకి అడుగు పెడుతున్నాం. షడ్రుచుల సమ్మేళనంతో తెలుగు వారి జీవితాల్లో ఆనందోత్సాహాలు పూయించేందుకు వచ్చింది ఉగాది.. ఈ పండుగను ప్రతి ఇంటా తీపి,వగరు, చేదు, కారం, పులుపు, ఉప్పు కలిపి చేసిన ఉగాది పచ్చడితో ఆనందంగా జరుపుకుంటారు.. కొత్త ఏడాదికి స్వాగతం పలుకుతారు.. పండుగ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా ఆలయాలు ముస్తాబయ్యాయి. రాజమహేంద్రవరం మంగళవారపు పేటలో ఉగాదికి విశేష అలంకరణలో శ్యామలాంబ అమ్మవారు.

- రాజమహేంద్రవరం కల్చరల్

కూటమిని గెలిపిస్తేనే అభివృద్ధి

- సీఎం జగన్‌ను గద్దె దించాలి
- రాష్ట్ర పరిస్థితులే కూటమికి కారణం
- ఎన్నికల్లో త్రివేణి సంగమం
- అంతా ఐక్యంగా పనిచేయాలి
- అన్ని వర్గాలకు జగన్ అన్యాయం
- పంచాయతీ నిధులు మళ్లింపు
- నిధులు కేంద్రానివి..సోకు జగన్‌ది
- కొవ్వూరు సభలో పురందేశ్వరి ఫైర్



ఎన్‌టీఆర్ బిడ్డగా పుట్టడం నా అదృష్టం : కొవ్వూరు సమావేశంలో మాట్లాడుతున్న పురందేశ్వరి చిత్రంలో అచ్చిబాబు

కొవ్వూరు, ఏప్రిల్ 8 : రాష్ట్రాన్ని రక్షించుకోవాలి. దేశాన్ని అభివృద్ధిలో పరుగులు పెట్టించాలంటే కూటమి అభ్యర్థులను గెలిపించుకోవాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు,రాజమహేంద్రవరం పార్లమెంట్ అభ్యర్థి దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. కొవ్వూరు పరిమి రామారాయుడు రత్తమ్మ కల్యాణ మండపంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొమ్ముల దత్తు అధ్యక్షతన సోమవారం నిర్వహించిన టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి నాయకుల సమన్వయ కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు. మూడు పార్టీల కార్యకర్తలను చూస్తుంటే చంద్రబాబు యుక్తి, పవన్‌కల్యాణ్ శక్తి, నరేంద్రమోదీ స్ఫూర్తి కలిపి త్రివేణి సంగమాన్ని చూస్తున్నామన్నారు. రాష్ట్రంలో ఉన్న పరిస్థితుల కారణంగా కూటమిగా ఏర్పడ్డామన్నారు. ఎంతో చరిత్ర ఉన్న రాజమహేంద్రవరం పార్లమెంటుకి కూటమి అభ్యర్థిగా ప్రతిపాదించడం తన అదృష్టమన్నారు. నా బీసీలు, నా ఎస్సీలు, నా ఎస్టీలు అంటూ సీఎం జగన్ గుండెలు బాదుకుంటున్నారు..ఇవాళ ఏ వర్గానికి మీరు న్యాయం చేశారో చెప్పాలన్నారు.వైసీపీ ఎమ్మెల్సీ అనంతబాబు తన కారు డ్రైవరును హత్య చేసి ఇంటికి డోర్ డెలివరీ చేస్తే అతన్ని పక్కన కూర్చోపెట్టుకున్నారు.ఇది ఎస్సీలకు న్యాయం చేయడమా అని ప్రశ్నించారు. ఇటీవల అనంతబాబు గన్‌మెన్లు ఎస్సీ పురుషుడిని ఏ విధంగా కొట్టారో మనందరం చూశామన్నారు. ఇదా ఎస్సీలకు న్యాయం చేయడం. బీసీ వర్గాలకు న్యాయం చేయాలని కేంద్ర ప్రభుత్వం బీసీ కమిషన్‌కు చట్టబద్ధత కల్పిస్తే ఇవాళ రాష్ట్రంలో బీసీ కమీషన్‌కు కనీసం చట్టబద్ధత కల్పించలేని అసమర్థ ప్రభుత్వాన్ని రాష్ట్రంలో చూస్తున్నామన్నారు. బీజేపీ దేశంలో సాధారణ ఎస్టీ కుటుంబం నుంచి వచ్చిన ద్రౌపది ముర్మును రాష్ట్రపతిని చేస్తే రాష్ట్రంలో ఎస్టీ గోడు పట్టించుకునే నాథుడు లేడంటే ఎంత బాధాకరం అన్నారు. టిడ్కో గృహాలు శిథిలావస్థకు చేరాయి. పేద సోదరి పట్టా ఇచ్చారు స్థలం ఇవ్వలేదని మీడియా ముందు పట్టాను చించివేసిందంటే రాష్ట్ర ప్రభుత్వం ఎంత మోసం చేసిందో ఆలోచించండి అన్నారు. గ్రామీణాభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని కేంద్రం పంచాయతీలకు వేసిన 15వ ఆర్థిక సంఘం నిధులను దారి మళ్లించి గ్రామాల అభివృద్ధిని కుంటుపరిచారు. అప్పులు చేసి అభివృద్ధి పనులు చేసిన ఎందరో సర్పంచ్ సోదరులు బిల్లులు రాక ఆత్మహత్యలు చేసుకున్న సంఘటనలు రాష్ట్రంలో ఉన్నాయన్నారు. అమరావతి రైతులు బాధను చెప్పుకోవడానికి వస్తే కొవ్వూరు రోడ్డు కం రైలు బ్రిడ్జిని మూసివేసిన సంఘటన మనమందరం చూశాం. ప్రాంతీయ విద్వేషాలు రెచ్చగొట్టే విధంగా మూడు రాజధానులు అంటూ మూడుముక్కలాటను తెరపైకి తీసుకొచ్చిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌దేనన్నారు.ప్రతి ఎకరాకు రూ. పదమూడున్నర వేలు ఇస్తానన్నారు. ఈ రోజు ఎంతిచ్చారో గుండెల మీద చెయ్యి వేసుకుని చెప్పాలన్నారు. కేంద్రం ఇస్తున్న ఆరు వేలు కలుపుని రూ. 13 వేలు ఇచ్చి నేనే ఇస్తున్నానని చెప్పుకోవడా నికి సిగ్గుగా లేదా అన్నారు. మోదీ 80 కోట్ల మందికి ఉచితంగా రేషన్ బియ్యం ఇస్తుంటే జగన్మోహనరెడ్డి ఒక బండి ఏర్పాటు చేసి తన బొమ్మ వేసుకుని ప్రచారం చేసుకోవడం అన్యాయం కాదా అన్నారు. మన ఆంధ్ర రాష్ట్రంలో త్రిపుల్ ఇంజను సర్కారు రాబోతుందన్నారు. మూడు పార్టీలు కూటమి కారణంగా చిన్నపాటి తేడాలు, విభేదాలు సహజమే.. వాటిని అధిగమించి లక్ష్యం సాధించాలన్నారు.పార్లమెంటు అభ్యర్థిగా తనను, అసెంబ్లీ అభ్యర్థిగా ముప్పిడి వెంకటేశ్వరరావును ఆశీర్వదించాలని కోరారు. కొవ్వూరు నియోజకవర్గ ఎన్డీఏ కూటమి ఉమ్మడి అభ్యర్థి ముప్పిడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ తల్లికి, చెల్లికి న్యాయం చేయలేని ముఖ్యమంత్రి మన రాష్ట్రం, మన పిల్లల భవిష్యత్ కోసం ఏం ఆలోచిస్తాడన్నారు. జగన్మోహనరెడ్డి ఒక సైకో. కరోనా కంటే డేంజర్ అన్నారు. 2004 ఎన్నికల్లో ఉన్న ఇళ్లు తాకట్టుపెట్టి వైఎస్ఆర్ నామినేషన్ వేశారని పెద్దలు చెబుతున్నారు. ఇదిలా ఉంటే పదేళ్ల కాలంలో దేశంలోని అందరూ ముఖ్యమంత్రుల్లో ధనవంతుడు జగన్మోహనరెడ్డి అని సర్వేలు చెబుతున్నాయన్నారు. అంటే ఈ రాష్ట్రాన్ని ఏ విధంగా దోచుకున్నారో ప్రజలు అర్థం చేసుకోవాలన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ కార్యకర్తలకు ఎటువంటి అపోహలు వద్దు అంతా ఒకే కుటుంబం అన్నారు. అందరూ కలిసికట్టుగా పనిచేయాలన్నారు. జగన్మోహనరెడ్డి ఆస్తులు కూడగట్టుకుని లండన్ వెళ్లిపోవాలని చూస్తున్నారు లండన్ కాదు ఎన్డీఏ కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే చంచల్‌గూడ జైలుకు పంపించాలన్నారు. టీడీపీ సీనియర్ నాయకులు పెండ్యాల అచ్చిబాబు మాట్లాడుతూ ఏసీ రూమ్‌లో కూర్చోవాల్సిన పవన్‌కల్యాణ్ లాంటి వ్యక్తులు రాష్ట్ర భవిష్యత్‌కై బయటకు వచ్చి పోరాటం చేస్తున్నారు ఆయనకు కులం అంటగట్టడం సరికాదు.. ఆయనను స్ఫూర్తిగా తీసుకుని మన పిల్లల భవిష్యత్ కొరకు మనమందరం కలిసికట్టుగా కూటమి అభ్యర్థులను గెలిపించుకోవాలన్నారు. బీజేపీ రాష్ట్ర నాయకుడు పరిమి రాధ మాట్లాడుతూ జగన్మోహనరెడ్డి సంక్షేమం పేరుతో సంక్షోభం సృష్టిస్తూ రాబోయే తరాలను నాశనం చేసే విధంగా పాలన చేస్తున్న ముఖ్యమంత్రిని గద్దెదించాలన్నారు. మునిసిపాలిటీ, రెవెన్యూ డివిజన్ కేంద్రం నిర్వీర్యం అవుతుంటే పట్టించుకోని హోం మంత్రి వనిత పక్క నియోజకవర్గాన్ని ఏవిధంగా అభివృద్ధి చేస్తారో ఆలోచించుకోవాలన్నారు. కార్యక్రమంలో ద్విసభ్య కమిటీ సభ్యులు కంఠమణి రామకృష్ణారావు, జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి,మద్దిపట్ల శివరామకృష్ణ, గొర్రెల శ్రీధర్,సూరపనేని చిన్ని,బీజేపీ,జనసేన నాయకులు కోడూరి లక్ష్మీనారాయణ, పిల్లలమర్రి మురళీకృష్ణ, బి.వి. ముత్యాలరావు,ఎం.రామచంద్రరావు,పిక్కి నాగేంద్ర, బూసి జెన్నిమారొబ్బ వెంకటేశ్వరరావు, ఉప్పులూరి రాజేంద్ర మున్నిసూసాన్, దేగల రామ తదితరులు పాల్గొన్నారు.



మేమంతా మీ వెంటే : కొవ్వూరు ఆత్మీయ సమావేశానికి హాజరైన మూడు పార్టీల నాయకులు, కార్యకర్తలు

రాజానగరంలో జరగని సమావేశం

కోరుకొండ, ఏప్రిల్ 8 : రాజానగరం నియోజకవర్గ స్థాయి బీజేపీ, టీడీపీ, జనసేన ఉమ్మడి ఆత్మీయ సమావేశం రసాభాసగా మారింది. బూరుగుపూడి ద్వారకామాయి గార్డెన్స్‌లో సోమవారం సాయంత్రం బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, రాజమహేంద్రవరం పార్లమెంట్ అభ్యర్థి పురందేశ్వరి నియోజకవర్గ నాయకులతో ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేశారు. అయితే సమావేశం ప్రారంభంలో వేదికపై కట్టిన బ్యానర్‌లో టీడీపీ రాజానగరం ఇన్‌చార్జ్ బొడ్డు వెంకటరమణ చౌదరి ఫొటో ముద్రించకపోవడంపై కొందరు టీడీపీ నాయకులు, కార్యకర్తలు వేదికపై ఉన్న నాయకులను ప్రశ్నించారు.ఏ పార్టీ ఇన్‌చార్జ్‌ల ఫొటోలు బ్యానర్‌పై ముద్రించడం లేదని కేవలం ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థి ఫొటోలు, పార్టీ అధినాయకుల ఫొటోలు మాత్రమే ముద్రిస్తున్నామని తాను రాజానగరం బీజేపీ ఇన్‌చార్జ్ అయినప్పటికీ తన ఫొటో కూడా ముద్రించుకోలేదని నీరుకొండ వీరన్న చౌదరి వివరణ ఇచ్చారు. అయినా టీడీపీ కార్యకర్తలు పట్టువీడలేదు. సమావేశాన్ని బహిష్కరించి బయటకు వెళ్లిపోతున్నట్టు ప్రకటించారు.ఈ నేపథ్యంలో బీజేపీ జిల్లా నాయకులు వేదికపై కట్టిన బ్యానర్‌ను తొలగించారు. ఇప్పుడు బ్యానర్ తీసేశాం కాబట్టి మీరు దయచేసి సహకరించాలని ఏదైనా తప్పు జరిగి ఉంటే క్షమించాలని బీజేపీ జిల్లా అగ్రనాయకులు వేదికపైనుంచి బహిరంగంగా క్షమాపణ చెప్పారు.అయినప్పటికీ టీడీపీ కార్యకర్తలు శాంతించలేదు.సమావేశపు ప్రాంతం నుంచి అరకిలోమీటరు దూరంలో ఉన్న టీడీపీ కార్యాలయానికి నినాదాలు చేసుకుంటూ వెళ్లిపోయారు. వేదికపై పురందేశ్వరి, జిల్లా నాయకులు మాత్రమే మిగిలారు. బీజేపీ నాయకుడు ఏపీఆర్ చౌదరి, ఎమ్మెల్యే అభ్యర్థి బత్తుల బలరామకృష్ణ టీడీపీ కార్యాలయానికి వెళ్లి నాయకులు,కార్యకర్తలను సుమారు రెండు గంటలు పాటు బుజ్జగించే ప్రయత్నం చేశారు.అయినా టీడీపీ నాయకులు, కార్యకర్తలు తిరిగి ఆత్మీయ సమావేశానికి రాలేదు.దీంతో రెండు గంటల పాటు బీజేపీ అధ్యక్షురాలు పురందేశ్వరి వేదికపైనే వేచి చూశారు.ఎమ్మెల్యే బుచ్చయ్యచౌదరి వచ్చి పురందేశ్వరితో మాట్లాడారు. అనంతరం ఆత్మీయ సమావేశంలో చిన్నచిన్న లోటుపాట్లు జరిగాయని, తదుపరి మరొకసారి టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీలతో సమన్వయం చేసుకుని ముందుకు వెళతామని చెప్పి పురందేశ్వరి సమావేశం నుంచి బయలుదేరి వెళ్లారు. దీంతో సమావేశానికి వేలాదిగా వచ్చిన మూడు పార్టీల నాయకులు, కార్యకర్తలు నిరుత్సాహంగా వెనుదిరిగారు.



కలెక్టర్ మాధవీలతకు వినతిపత్రం అందజేస్తున్న ఫ్యాప్టో నాయకులు

పోలింగ్ కేంద్రాల వద్ద జాగ్రత్తలు చేపట్టండి

అధిక ఉష్ణోగ్రతలపై ఐఎండీ హెచ్చరికలతో కలెక్టర్ ఆదేశం

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 8: అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్న తరుణంలో కేంద్ర, రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ఐఎండీ జారీ చేసిన హెచ్చరికల నేపథ్యంలో పోలింగ్ కేంద్రాల వద్ద తగు ఏర్పాట్లు చేస్తామని జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ కే.మాధవీలత తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆర్‌వోలకు,ఎన్నికల సిబ్బంది పలు ఆదేశాలు జారీ చేశారు. సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా వేసవి ఎండల ప్రభావాన్ని తగ్గించడానికి నియోజకవర్గ రిటర్నింగ్ అధికారులు తగిన ముందస్తు కార్యచరణ ప్రణాళికలతో సిద్ధం కావాలని ఆదేశించారు.ఓట్లు వేయడానికి పోలింగ్ కేంద్రాలకు వచ్చే మహిళలు, వృద్ధులు ,దివ్యాంగులను దృష్టిలో పెట్టుకుని తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లో తగినంత వెంటిలేషన్ ఉండేలా చూసుకోవడం, తాగునీటి సదుపాయం, వడగాడ్పులకు గురైతే చికిత్స అందించడం,ప్రభుత్వ ఏజెన్సీలు, ఆరోగ్య విభాగం అత్యవసర సేవల విభాగాలతో సమన్వయం చేసుకోవాలన్నారు. అధిక ఉష్ణోగ్రతల నేపథ్యంలో చేపట్టిన భద్రత చర్యలపై విస్తృత ప్రచారం చేయాలన్నారు.

కలెక్టర్‌కు ఫ్యాప్టో వినతి

రాజమహేంద్రవరం అర్బన్, ఏప్రిల్ 8 : కొన్ని వర్గాలకు ఎన్నికల విధుల నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరుతూ కలెక్టర్ మాధవీలతకు సోమవారం ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ఫ్యాప్టో) తరపున వినతిప్రతం అందజేశామని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ.షరీఫ్ తెలిపారు. ఉపాధ్యాయులకు ఎన్నికల విధులు కేటాయింపులో దివ్యాంగులకు, గర్భిణులు, బాలింతలకు, తీవ్రమైన అనారోగ్యానికి గురైన వారికి వైద్య చికిత్సలు పొందుతున్న వారికి ఆరు నెలల్లోపు రిటైర్మెంట్ అయ్యే వారికి, స్టడీ లీవ్‌లో ఉన్న వారికి మినహాయింపు వర్తింపచేయాలన్నారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ ఎన్నికల విధులకు సంబంధించి ఉద్యోగుల కొరత ఉందని, ప్రత్యేకమైన మెడికల్ కారణాలు ఉన్న వారికి మాత్రం మినహాయింపు ఇస్తామని స్పష్టం చేశారన్నారు. మెడికల్ బోర్డు సిఫారసు ఆధారంగా మినహాయింపులు ఇస్తామన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయూ ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్, ఏపీటీఎఫ్ 257 నాయకులు డి.దుర్గారావు, ఫ్యాప్టో కార్యవర్గ సభ్యులు ఎన్.రవిబాబు, కేవీఎస్ ప్రకాశరావు తదితరులు పాల్గొన్నారు.

ఓటుహక్కు వినియోగంపై అవగాహన ర్యాలీ



కొవ్వూరులో ర్యాలీ నిర్వహిస్తున్న సబ్ కలెక్టర్ శ్రీవాస్తవ

కొవ్వూరు, ఏప్రిల్ 8: ప్రతి పౌరుడు ఓటుహక్కును వినియోగించుకోవాలని సబ్ కలెక్టర్ ఆశుతోష్ శ్రీవాస్తవ అన్నారు. ఓటు హక్కు వినియోగంపై సోమవారం కొవ్వూరు విజయవిహార్ సెంటర్ నుంచి బస్టాండ్ వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. సబ్ కలెక్టర్ మాట్లాడుతూ భారత రాజ్యాంగం 18 ఏళ్లు నిండిన ప్రతిఒక్కరికి ఓటు హక్కు కల్పించిందని, ఓటు ఒక వజ్రాయుధమని అన్నారు. ఎన్నికల్లో ఓటును సమర్థవంతమైన నాయకుడికి వేసి ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాలన్నారు. మద్యం, డబ్బుకు ఓటుకు అమ్ముకోరాదన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ కె.మస్తాన్, ఎన్నికల డీటీ ఎం.కమల్‌సుందర్, సీడీపీవో డి.మమ్మీ, బీఎల్‌వోలు, సెక్టార్, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

నిడదవోలులో ఫ్లైయింగ్ స్క్వాడ్ తనిఖీలు



ఆర్టీసీ డిపో పార్శిల్ సర్వీస్‌లో తనిఖీలు చేస్తున్న దృశ్యం

నిడదవోలు, ఏప్రిల్ 8: నిడదవోలు ఆర్టీసీ డిపో ఆవరణలోని పార్శిల్ సర్వీస్ కార్యాలయంలో సోమవారం ఫ్లైయింగ్ స్క్వాడ్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఫ్లైయింగ్ స్క్వాడ్ అధికారిణి సుజాత మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పార్శిల్ కార్యాలయాలు, వాహనాలు, అనుమానాస్పదంగా సంచరించే వ్యక్తులను తనిఖీ చేస్తున్నట్టు చెప్పారు. ఈ తనిఖీల్లో ఏఎస్ఐ రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

14 మంది వలంటీర్లు రాజీనామా

తాళ్లపూడి, ఏప్రిల్ 8: మండలంలో వలంటీర్ల రాజీనామాలు కొనసాగుతున్నాయి. తిరుగుడుమెట్ట గ్రామంలో 14 మంది వలంటీర్లు సోమవారం తమ రాజీనామా పత్రాలను ఎంపీడీవో వెంకటరమణకు అందించారు. కొన్ని ప్రధాన పార్టీ నాయకుల మాటలకు మనస్తాపం చెంది రాజీనామాలు చేస్తున్నామని వలంటీర్లు తెలిపారు.

మంచినీటి సరఫరాలో ఇబ్బందులు ఉండకూడదు



దేవరపల్లిలో ఉపాధ్యాయులతో సమీక్షిస్తున్న ఎంఈవో తిరుమల దాసు

దేవరపల్లి, ఏప్రిల్ 8: విద్యార్థులకు మంచినీటి సరఫరాలో ఇబ్బందులు తలెత్తకూడదని, పరీక్షలు సమగ్రమంగా రాసేలా చూడాలని ఎంఈవో తిరుమలదాసు సూచించారు. దేవరపల్లిలో ఉపాధ్యాయులతో సోమవారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. 3, 4, 5 తరగతులకు ఈ నెల 10వ తేదీ నుంచి, 6,7,8, 9 తరగతులకు 12వ తేదీ నుంచి పరీక్షలు ప్రారంభమవుతాయని, అందుకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. వేసవి సెలవుల్లో పాఠశాలలు తెరవకూడదని, ఒంటిపూట బడుల్లో మధ్యాహ్నం తరగతులు నిర్వ హించకూడదని, అలా నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎంఈవో హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంఈవో అప్పారావు పాల్గొన్నారు.

'పార్డ్ ఇండియా' ఆర్థిక సాయం

దేవరపల్లి, ఏప్రిల్ 8: మండలంలోని యర్నగూడెం గ్రామానికి చెందిన బిగం గాధర్ మృతిచెందడంతో ఆయన కుటుంబానికి రూ.10 వేలు ఆర్థిక సాయంతో పాటు నిత్యావసరాలు, రైస్‌ప్యాకెట్టు అందజేసినట్టు పార్డ్ ఇండియా సభ్యుడు సోమిశెట్టి వెంకట్రావు తెలిపారు. గంగాధర్ కుటుంబానికి అండగా ఉంటామని, పిల్లలకు చదువు నిమిత్తం స్కాలర్‌షిప్ అందజేస్తామన్నారు. కార్యక్రమలో పార్డ్ ఇండియా సభ్యులు సత్యనారాయణ, బాబురావు, తదితరులు పాల్గొన్నారు.

వేతన ఒప్పంద చర్చలు మరోసారి విఫలం



నిరసన చేస్తున్న లారీ కార్మికులు

కొవ్వూరు, ఏప్రిల్ 8: లారీ కార్మికుల వేతన ఒప్పంద చర్చలు మరోసారి విఫలమయ్యాయి. వేతనాలు పెంచాలని కొవ్వూరు మండలం పంగిడిలో సింగిల్ లారీలపై పనిచేస్తున్న కార్మికులు నెల రోజులుగా పోరాడుతున్నారు. క్వారీ అండ్ క్రషర్ యాజమాన్య సంఘం గత నెల 22న ప్రస్తుత వేతనాలపై రూ.3400 పెంచింది. సింగిల్ లారీ యజమానులు వేతనాలు పెంచలేమని చెప్పింది. దీంతో మార్చి 23 నుంచి సింగిల్ లారీ కార్మికులు సమ్మెబాట పట్టారు. సోమవారం పంగిడిలో అసిస్టెంట్ లేబర్ కమిషనర్ ఆధ్వర్యంలో యజమానులు, కార్మిక సంఘాలతో చర్చలు జరిపారు. వేతనాలపై రూ.1500 మాత్రమే పెంచగలమని యజమానులు తెలుపగా రూ.2 వేలు పెంచాలని కార్మిక నాయకులు డిమాండ్ చేశారు. చర్చలు విఫలమవ్వడంతో కార్మికులు సమ్మెను కొనసాగిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ నాయకులు పి.నాగేశ్వరరావు, ఐఎన్‌టీయూసీ నాయకులు వై.దుర్గారావు, నాగరాజు, ప్రగతిశీల కార్మిక సంఘం నాయకుడు ఎస్‌కే మస్తాన్, యూనియన్ ప్రతినిధులు రాజు, దిలీప్, లక్ష్మణరావు, సురేష్, ఎస్‌కే ఫైజుల్లా పాల్గొన్నారు.

'నీటి గంట'పై అవగాహన

పెరవలి, ఏప్రిల్ 8: మండలంలోని అజ్జరం నెంబర్-1 పాఠశాలలో విద్యార్థులకు నీటి గంటపై సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు ఎంఆర్‌వీఎస్ఎన్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు వేసవి కాలంలో నీరు ఎంత ఎక్కువ తాగితే అంత మంచిదని, పెద్దలు కూడా తరచూ నీరు తాగాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కె.కాశీ విశ్వనాథం, ప్రసాద్ పాల్గొన్నారు.

కూటమి సమావేశాన్ని విజయవంతం చేయండి

» నిడదవోలు అభ్యర్థి దుర్గేష్, టీడీపీ ఇన్‌చార్జి బూరుగుపల్లి

పెరవలి, ఏప్రిల్ 8: నిడదవోలులో ఈ నెల 10న జరగనున్న టీడీపీ-జనసేన-బీజేపీ సమావేశాన్ని విజయవంతం చేయాలని నియోజకవర్గ అభ్యర్థి కందుల దుర్గేష్, టీడీపీ ఇన్‌చార్జి బూరుగుపల్లి శేషారావు అన్నారు. మండలంలోని కానూరులో వైనాట్ ఫంక్షన్ హాలులో సోమవారం సాయంత్రం మూడు పార్టీల నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శేషారావు మాట్లాడుతూ టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన అధినేత పవన్ కల్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి పాల్గొనే మొదటి సమావేశం నిడదవోలులో నిర్వహిస్తున్నందున విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశానికి హాజరైన జనసందోహాన్ని చూసి వైసీపీ నాయకుల్లో వణుకు పుట్టాలని, ఆ స్థాయిలో అన్ని గ్రామాల నుంచి అధిక సంఖ్యలో తరలి రావాలన్నారు. దుర్గేష్ మాట్లాడుతూ మూడు పార్టీల నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి బహిరంగ సభను విజయవంతం చేయడంతోపాటు రాబోయే ఎన్నికల్లో అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు అతికాల రామకృష్ణమ్మ, భూపతిరాజు రవివర్మ, సలాది కృష్ణమూర్తి, బొడ్డు రామాంజనేయులు, పిప్పర రవి, కొమ్మన వెంకటేశ్వరరావు, సింహాద్రి రామకృష్ణ, మూడు పార్టీల సర్పంచ్‌లు, ముఖ్యనాయకులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బూరుగుపల్లి శేషారావు

లోగ్రేడ్ పొగాకును అమ్మేయండి

పొగాకు బోర్డు చైర్మన్ సీహెచ్ యశ్వంత్‌కుమార్



దేవరపల్లిలో పొగాకు రైతులతో సమీక్షిస్తున్న చైర్మన్ యశ్వంత్‌కుమార్

దేవరపల్లి, ఏప్రిల్ 8: లోగ్రేడ్ పొగాకును వేలం కేంద్రాల్లో ఎప్పటికప్పుడు అమ్మకాలు చేసుకోవాలని పొగాకు బోర్డు చైర్మన్ సీహెచ్ యశ్వంత్‌కుమార్ సూచించారు. దేవరపల్లి పొగాకు వేలం కేంద్రంలో సోమవారం రైతులతో ఆయన సమీక్షించారు. ఈ ఏడాది పొగాకు బోర్డు వేలం ప్రారంభించినప్పటికి అనుకున్న స్థాయిలో అమ్మకాలు జరగలేదన్నారు. లోగ్రేడ్ పొగాకు ధర ఆశాజనకంగా ఉండడంతో అమ్మకాలు సాగించాలన్నారు. హైగ్రేడ్ పొగాకు మార్కెట్‌లోకి వస్తే లోగ్రేడ్ ధర తగ్గే అవకాశం ఉందన్నారు. అందుకే ముందుగానే లోగ్రేడ్ పొగాకును అమ్మకాలకు పెట్టాలన్నారు. వేలం కేంద్రం పరిధిలో 66మిలియన్ కిలోలు పొగాకు ఉత్పత్తి అయినట్టు అంచనా వేశామన్నారు. జింబాబ్వే, బ్రెజిల్, చైనా దేశాల్లో ఈ ఏడాది ఉత్పత్తి తగ్గిందని దీని వల్ల మన పొగాకుకు డిమాండ్ ఉంటుందని ఆశాభావం వ్యక్తంచేశారు. ఇప్పుడు లోగ్రేడ్ పొగాకును కిలో రూ.10 తగ్గించుకుంటున్నారని కంపెనీ వారు రేటు పెంచే విధంగా చైర్మన్ చూడాలన్నారు. ఈ ఏడాది పొగాకు నాట్లు ఆలస్యంగా వేశారని వచ్చే ఏడాది సకాలంలో వేసుకోవాలని సూచించారు. కార్యక్ర మంలో పొగాకు బోర్డు వైస్ చైర్మన్ జి.వాసుబాబు, ఆర్ఎం ఆదిశేషయ్య, దేవరపల్లి వేలం నిర్వహణాధికారి జీఎల్‌కే ప్రసాద్, రైతు సంఘం నాయకులు ఆచంట గోపాలకృష్ణ, కరుటూరి శ్రీనివాస్, కాట్రు సత్యనారాయణ, యాగంటి వెంకటేశ్వరరావు, రాజేంద్రబాబు, ముళ్లపూడి శివాజీ తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమం, అభివృద్ధికి పెద్దపీట

» నిడదవోలు ఎమ్మెల్యే అభ్యర్థి కందుల దుర్గేష్

నిడదవోలు, ఏప్రిల్ 8: పేదల సంక్షేమం, అభివృద్ధికి జనసేన-టీడీపీ- బీజేపీ ప్రభుత్వం పెద్దపీట వేయనుందని ఎమ్మెల్యే అభ్యర్థి కందుల దుర్గేష్ అన్నారు. సోమవారం నిడదవోలులో ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ఉమ్మడి మేనిఫెస్టోను వివరించారు. గాజుగ్లాసు గుర్తుపై ఓటు వేసి తనకు అఖండ విజయాన్ని అందించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన వెంట బూరుగుపల్లి శ్రీనివాసు, కొమ్మిన వెంకటేశ్వరరావు, రంగా రమేష్, బండి గోపాలకృష్ణ, మూడు పార్టీల నాయకులు ఉన్నారు.



నిడదవోలులో ప్రచారం నిర్వహిస్తున్న దుర్గేష్

టీడీపీలో చేరికలు



వైసీపీ నాయకుడు రామారావును టీడీపీలోకి ఆహ్వానిస్తున్న అచ్చిబాబు

చాగల్లు, ఏప్రిల్ 8: రాష్ట్రంలో తెలుగుదేశం గాలి వీస్తుందని అందుకోసమే వైసీపీ నుంచి అనేకమంది నాయకులు టీడీపీలో చేరుతున్నారని టీడీపీ సీనియర్ నాయకుడు పెండ్యాల అచ్యుతరామయ్య(అచ్చిబాబు) అన్నారు. సోమవారం కొవ్వూరు పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో టీడీపీ-జనసేన-బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి ముప్పిడి వెంకటేశ్వరరావు సమక్షంలో మండలంలోని ఊనగట్లకు చెందిన బీసీ నాయకుడు బొల్లా రామారావు టీడీపీలో చేరారు. ఆయనకు అచ్చిబాబు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో ద్విసభ్య కమిటీ సభ్యులు జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి, కంఠమని రామకృష్ణ, ఆళ్ల హరిబాబు, నాదెళ్ళ శ్రీరామ్‌చౌదరి, బొల్లిన శివనాగేంద్ర, పుల్లూరి వెంకటేశ్వరరావు, కారింకి సత్యనారాయణ, వీరవల్లి సత్యనారాయణ, మునుకోటి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పెన్షన్ భిక్ష కాదు.. హక్కు

నల్లజర్ల, ఏప్రిల్ 8: పెన్షన్ యజమాని ఇచ్చే భిక్ష కాదని, పెన్షన్‌దారుల హక్కు అని పెన్షనర్ల సంఘం మండలాధ్యక్షులు ఐవీ సత్యం అన్నారు. పెన్షన్ సాధకుడు, పెన్షనర్ల ఆశాజ్యోతి ధరమ్ స్వరూప్ నకారా జయంతి కార్యక్రమం సోమవారం నల్లజర్లలోని ఎంఈవో కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1982 డిసెంబరు 17న వైవీ చంద్రచూడ్ ధర్మాసనం చారిత్రాత్మక తీర్పును ఇచ్చిందని, దాని ప్రకారం విశ్రాంత ఉద్యోగులకు పెన్షన్ ఇవ్వడం ప్రభుత్వం విధి, అది వారి స్థిరమైన హక్కు అని అన్నారు. అనంతరం కేక్ కట్ చేసి స్వీట్లు పంచారు. కార్యక్రమంలో ఐడీవీ అప్పారావు, ప్రసాద్, ఏసురత్నం, ఎన్.రాజేంద్రప్రసాద్, ప్రభుదాసు, నెక్కలపూడి ప్రతాప్, ఎస్.బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

రతీష్ పుట్టినరోజు వేడుకలు



కేక్ కట్ చేస్తున్న టీడీపీ నాయకుడు పసుమర్తి రతీష్

నల్లజర్ల, ఏప్రిల్ 8: పోతవరం మాజీ సర్పంచ్, టీడీపీ నాయకుడు పసుమర్తి రతీష్ పుట్టినరోజు వేడుకలను ఆయన అనుచరులు ఘనంగా నిర్వహించారు. సోమవారం పోతవరంలో వారు ఏర్పాటు చేసిన కేక్‌ను రతీష్ కట్ చేశారు. అధిక సంఖ్యలో అభిమానులు వచ్చి ఆయనకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ జమ్ముల సతీష్, యద్దనపూడి బ్రహ్మరాజు,అబ్బురి నరేష్, బేతిన అనిల్, ప్రత్తిపాటి కృష్ణ, కొండేపాటి శేషగిరి తదితరులు పాల్గొన్నారు

21 టన్నుల రేషన్ బియ్యం పట్టివేత

నల్లజర్ల, ఏప్రిల్ 8: అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్న లారీని సీజ్ చేసినట్టు సివిల్ సప్లై డీటీ సత్యనారాయణ తెలిపారు. సోమవారం ఉదయం సివిల్ సప్లై, దేవరపల్లి పోలీసులు సంయుక్తంగా వాహన తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో ఖమ్మం నుంచి కాకినాడకు లారీలో 21 టన్నులు రేషన్ బియ్యం తరలిస్తున్నట్టు గుర్తించారు. అక్రమంగా పీడీఎస్ బియ్యం తరలిస్తున్న వ్యక్తులపై కేసు నమోదు చేసి, బియ్యాన్ని గోపాలపురం ఎంఎల్ఎస్ పాయింట్‌కు తరలించారు.

65 మద్యం సీసాలు స్వాధీనం

దేవరపల్లి, ఏప్రిల్ 8: దేవరపల్లి ఎస్ఈబీ స్టేషన్ పరిధిలో అక్రమంగా విక్రయిస్తున్న 65 మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్టు ఎస్ఈబీ సీఐ కేవీ స్వామి తెలిపారు. గోపాలపురం మండలం జగన్నాథపురంలో వ్యక్తిని అరెస్టు చేసి 10మద్యం సీసాలు, దేవరపల్లి మండలం యర్నగూడెనికి చెందిన వ్యక్తి అరెస్టు చేసి 55 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. గోపాలపురం మండలం గోపవరంలో ఒక వ్యక్తిని అరెస్టు చేసి 35లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నామన్నారు. ఆరుగురు పాత నిందితులను గోపాలపురం తహశీల్దార్ వద్ద, ఒకర్ని దేవరపల్లి తహశీల్దార్ వద్ద బైండోవర్ చేశామన్నారు.

రూ.7 లక్షలు స్వాధీనం

ధవళేశ్వరం, ఏప్రిల్ 8: సాధారణ ఎన్నికలు సందర్భంగా కాటన్ బ్యారేజ్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద సీఐ వినయ్‌మోహన్ ఆధ్వర్యంలో సోమవారం వాహనాలు తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా నిడదవోలు నుంచి కారులో ప్రయాణిస్తున్న జిల్లా కామన్ ఎగ్జామినేషన్ బోర్డు సెక్రటరీ డి.అనిత వర్ధిని నుంచి రూ.7,07,500 నగదు స్వాధీనం చేసుకున్నారు. తదుపరి చర్యలు అనంతరం ఎఫ్ఎస్‌టీ టీంకు అప్పగించినట్టు ఎస్ఐ క్రాంతికుమార్ తెలిపారు.

అచ్చెన్నాయుడికి ముప్పిడి పరామర్శ



కొవ్వూరు, ఏప్రిల్ 8: టీడీపీ రాష్ట్రాధ్యక్షుడు కింజరపు అచ్చెన్నాయుడిని టీడీపీ-జనసేన-బీజేపీ నియోజకవర్గ అభ్యర్థి ముప్పిడి వెంకటేశ్వరరావు, ద్విసభ్య కమిటీ సభ్యులు కంటమణి రామకృష్ణారావు, జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి పరామర్శించారు. అచ్చెన్నాయుడి తల్లి కళావతమ్మ ఇటీవల మృతిచెందారు. దీంతో శ్రీకాకుళం జిల్లా నిమ్మాడ గ్రామంలో అచ్చెన్నాయుడి స్వగృహంలో సోమవారం పరామర్శించి కళావతమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమలో నియోజకవర్గ పరిశీలకుడు గొర్రెల శ్రీధర్ తదితరులున్నారు.

కొవ్వూరు టిక్కెట్టును స్థానికులకే ఇవ్వాలి

కొవ్వూరులో కాంగ్రెస్ నాయకుల రిలే దీక్షలు

కొవ్వూరు, ఏప్రిల్ 8: కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ టిక్కెట్టును స్థానికులకే ఇవ్వాలని ఆ పార్టీ నాయకులు రిలే దీక్షలు చేపట్టారు. సోమవారం కొవ్వూరులోని వాటర్‌ట్యాంకు వద్ద పార్టీ మండలాధ్యక్షుడు జొన్నకూటి రవికుమార్ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు ప్రారంభించారు. రెండేళ్ల క్రితం అప్పటి పీసీసీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజుకు కొవ్వూరు అసెంబ్లీ టిక్కెట్టును స్థానికులకే ఇవ్వాలని వినతిపత్రం అందజేశామన్నారు. అయినా కక్ష సాధింపుతో వ్యవహరిస్తూ కార్యకర్తలను, నాయకులను కాదని స్థానికేతర వ్యక్తికి అభ్యర్థిత్వం ఇవ్వడం తమకు అభ్యంతరకరంగా ఉందన్నారు. కార్యక్రమంలో మట్టా సుబ్బారావు, సాకా పుల్లారావు తదితరులు పాల్గొన్నారు.

కిక్ బాక్సింగ్ విజేతకు నగదు ప్రోత్సాహకం



దివాన్‌చెరువు, ఏప్రిల్ 8: అఖిల భారత విశ్వవిద్యాలయాల కిక్ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్‌లో ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయానికి కాంస్య పతకం సాధించిన సీహెచ్ దినేష్‌కు రూ.20 వేల నగదు ప్రోత్సాహకాన్ని వీసీ ఆచార్య కె.పద్మరాజు సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ మీరట్‌లోని స్వామి వివేకానంద సుబర్తి విశ్వవిద్యాలయంలో జరిగిన ఛాంపియన్‌షిప్‌లో దినేష్ 81 కిలోల విభాగంలో కాంస్య పతకాన్ని కైవసం చేసుకున్నారన్నారు. దినేష్ నన్నయ అనుబంధ కళాశాలయైన రాజోలు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చదువుతున్నాడని తెలిపారు. ప్రతిభావంతులైన క్రీడాకారులకు విశ్వవిద్యాలయం సహాయ సహకారాలు అందిస్తుందన్నారు. కార్యక్రమంలో క్రీడాబోర్డు కార్యదర్శి బి.రామ్‌గోపాల్, కిక్ బాక్సింగ్ కోచ్ ఎం.భవానీశంకర్ తదితరులు పాల్గొన్నారు.

పూలమార్కెట్‌కు ఉగాది శోభ



కడియపులంక అంతరాష్ట్ర పూలమార్కెట్

కడియం, ఏప్రిల్ 8: కడియపులంక అంతరాష్ట్ర పూలమార్కెట్ ఉగాది శోభను సంతరించుకుంది. రెండు రోజుల నుంచి పూల అమ్మకాలు ఊపందుకున్నాయి. వేసవి తీవ్రతతో దిగుబడులు తగ్గాయని రైతులు అంటున్నారు. ఆ కారణంతో పూల ధరలు పెరిగాయి. ప్రస్తుతం కడియపులంక పూలమార్కెట్‌లో పూల ధరలు ఇలా ఉన్నాయి. మల్లెలు (కిలో) రూ.800, లిల్లీ (కిలో) రూ.100, పసుపు చామంతి(కిలో) రూ.250-రూ.300, వైట్‌చామంతి(కిలో) రూ.300-రూ.350, నీలం చామంతి(కిలో) రూ.300, పసుపు బంతి(కిలో) రూ.50-రూ.80, కలకత్తా బంతి(కిలో) రూ.80-రూ.100, స్టార్‌గులాబీ(కిలో) రూ.250, డచ్ (20 పూలు) రూ.300, కనకంబరం (బారు-1) రూ.120-రూ.130, దేశవాళీ గులాబీ (100 పూలు) రూ.100 ఉన్నాయి.

ప్రాణం తీసిన స్నానం సరదా

గోదావరిలో జారి యువకుడు మృతి



కడియం/ధవళేశ్వరం, ఏప్రిల్ 8: సరదాగా స్నేహితులతో కలిసి ఓ యువకుడు గోదావరి స్నానానికి వెళ్ళాడు. ప్రమాదవశాత్తూ కాలు జారి ధవళేశ్వరం వద్ద గోదావరిలో గల్లంతయ్యాడు. స్థానికుల కథనం ప్రకారం.. కడియం మండలం దుళ్ల గ్రామానికి చెందిన బర్నికల అశోక్‌కుమార్(18) తన స్నేహితులతో కలిసి ఆదివారం సాయంత్రం ధవళేశ్వరం వద్దకు గోదావరి స్నానానికి వెళ్లాడు. స్నానానికి దిగుతుండగా నాచుకు జారి గల్లంతయ్యాడు. స్నేహితులు గమనించి కేకలు వేయడంతో స్థానికులు వచ్చి అశోక్ మృతదేహాన్ని బయటకు తీశారు. ధవళేశ్వరం ఏఎస్ఐ శివాజీ సంఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజమహేంద్రవరం ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు. కాగా అశోక్‌కు తల్లిదండ్రుల తోపాటు పెళ్లి కావలసిన అక్క ఉన్నారు. అశోక్ పదో తరగతి చదువుతుండగా తండ్రి రాజు అనారోగ్యానికి గురికావడంతో చదువుకు స్వస్తి చెప్పి తాపీ పనిలో చేరాడు. అప్పటి నుంచి కుటుంబ భారమంతా తానే మోస్తున్నాడు. కుమారుడి మృతితో కుటుంబం సభ్యుల రోదనలు మిన్నంటాయి.

ఆధునిక పరిజ్ఞానంతో అధిక దిగుబడులు

ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం ఏడీ శ్రీనివాస్

దివాన్‌చెరువు, ఏప్రిల్ 8: వ్యవసాయ పంటల్లో నాణ్యమైన, స్థిరమైన దిగుబ డులు ఆధునిక పరిజ్ఞానంతోనే సాధ్యమని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం సహ సంచాలకుడు ధన్యంరాజు శ్రీనివాస్ అన్నారు. స్థానిక ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ చల్లా వెంకట నరసింహారావుతో కలసి ఆయన శ్రీకృష్ణపట్నంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే సార్వాలో రైతులు అభిమతం ప్రకారం రూపొందించిన నూతన రకాలైన ఎంటీయూ 1271, బీపీటీ 2846, ఎన్ఎల్ఆర్ 3238 వంటి రకాలను రైతుల కమతాల్లో ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు పరీక్షిస్తారన్నారు. కోతులు, ఎలుకల నుంచి పంట రక్షణకు సోలార్ కంచె, ఎరతెర పద్ధతులను పరీక్షించారు, నరసింహారావు మాట్లాడుతూ జిల్లాలో రాజానగరం, కోరు కొండ, నల్లజర్ల, కొవ్వూరు, అనపర్తి వంటి వరి పండించే ప్రాంతాలకు సహ సంచాలకుల ప్రోత్సాహంతో మినీకిట్స్ అందజేస్తామన్నారు. తాము, మార్టేరు ఏడీఆర్ శ్రీనివాస్ కోరుకొండ మండలంలోని దోసకాయలపల్లి, శ్రీరంగపట్నం, కోటికేశవరం గ్రామాల్లో కూడా పర్యటించామన్నారు. ఈ సందర్భంగా ఏడీఆర్ రైతు కమతాల్లో ప్రయోగాలను సందర్శించి వారి అభిప్రాయాలను, వారికి కావలసిన సాంకేతిక వనరులను అడిగి తెలుసుకున్నారని చెప్పారు. కార్యక్రమంలో ఏరువాక ప్రధాన శాస్త్రవేత్తలు పి.అమ్మాజీ ఎస్.హైమజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలోకి బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు

గోకవరం, ఏప్రిల్ 8: మండలంలోని గుమ్మళ్ళదొడ్డి సచివాలయ కన్వీనర్, బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు, పీఎంపీ అసోసియేషన్ జిల్లా కోశాధికారి పెంటిమేని చిన్ని ఆధ్వర్యంలో 200 మంది వైసీపీ కార్యకర్తలు సోమవారం టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వారం దరికీ జ్యోతుల నెహ్రూ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో నెహ్రూ మాట్లాడుతూ గత ఎన్నికల సమయంలో మాయమాటలు చెప్పి మోసం చేసిన వైసీపీ ప్రభుత్వానికి గుణపాఠం చెప్పాలన్నారు.